
ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 25 ఏప్రిల్ 2024



ఆర్వోకు నామినేషన్ ప్రతులను అందజేస్తున్న సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి, పక్కన తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



వెంకటాచలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ



వెంకటగిరిలో జరిగిన ర్యాలీలో అభివాదం చేస్తున్న కురుగొండ్ల

## నామినేషన్లకు నేడే ఆఖరు!

- చివరి రోజున భారీగా దాఖలయ్యే అవకాశం
- 6వ రోజు 47 మంది అభ్యర్థులు.. 55 సెట్లు
- నెల్లూరు పార్లమెంటుకు ఆరు నామినేషన్లు

నెల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో తొలిఘట్టం నామినేషన్ల స్వీకరణకు గురువారం గడువు ముగియనుంది. చివరిరోజున భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది. కాగా, 6వ రోజు బుధవారం కూడా నామినేషన్లు వెల్లువలా దాఖలయ్యాయి. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 47 మంది అభ్యర్థులు 55 సెట్ల నామినేషన్ ప్రతులను ఆర్వోలకు అందజేశారు. కందుకూరులో ఏడుగురు, కావలిలో ఆరుగురు, ఆత్మకూ రులో ఐదుగురు, కోవూరులో ఐదుగురు, నెల్లూరు సిటీలో ఎనిమిది మంది, నెల్లూరు రూరల్‌లో ముగ్గురు, సర్వేపల్లిలో ముగ్గురు, ఉదయగిరిలో నలుగురు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఆరు నామినేషన్లు దాఖ లు అయ్యాయి. సర్వేపల్లిలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయ గిరిలో వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరులో మేకపాటి విక్రమ్ రెడ్డిలు నామినేషన్లు వేశారు. ఈ మూడు చోట్లా వీరి కుటుంబ సభ్యులు డమ్మీగా మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. అలానే వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్య ర్థులు నామినేషన్లు వేశారు. బుధవారంతో అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఇక నామినేషన్ల స్వీకరణకు కూడా ఒక్క రోజే మిగిలింది. గురువారం గడువు ముగియనుండటంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. కాగా, శుక్రవారం వచ్చిన నామినేషన్లను అధికారులు పరిశీలించనున్నారు.

**వెంకటగిరిలో కురుగొండ్ల**

వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి వారిని దర్శనం చేసుకుని అనంతరం ర్యాలీగా బయలుదేరి ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్వోకు నామినేషన్ ప్రతులు అందజేశారు.

## నిండు ప్రాణాలను బలిగొన్న అతివేగం

- ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొన్న కారు
- ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

కావలి రూరల్, ఏప్రిల్ 24 : త్వరగా గమ్యానికి చేరుకోవాలన్న ఆతృత.. మితిమీరిన వేగం ముగ్గురు ప్రాణాలను బలిగొంది. బుధవారం తెల్లవారుజామున కావలి సమీపంలోని ముసునూరు వద్ద జాతీయ రహదారిపై ఆగివున్న లారీని ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని అశోక్‌నగర్‌కు చెందిన తిరునాతి సుబ్రహ్మణ్యం కుమార్తె కల్యాణి కొయ్యలగూడెంలో ఓ ఫ్యాన్సీషాపు నిర్వహిస్తోంది. వన్‌గ్రామ్ గోల్డు ఆభరణాల కొనుగోలు కోసం హిజ్రా ఎర్రాబత్తిన సిరి అలియాస్ రాజ్‌కుమార్‌తోపాటు వంగల కుమార్, ఈయన భార్య కుమారితో కలిసి కల్యాణి కారులో సోమవారం రాత్రి చెన్నై బయలుదేరారు. అక్కడ షాపింగ్ ముగించుకుని మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కావలి సమీపంలోని ముసునూరు టోల్‌గేట్ వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటైనర్ లారీని కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో కారులో ఉన్న కల్యాణి (21), రాజ్‌కుమార్ (30), వంగల కుమార్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. కంటైనర్ లారీ కిందకు కారు దూసుకువెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. విషయం తెలిసిన వెంటనే కావలి డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ కాటూరి శ్రీని వాసరావు, టూ టౌన్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను పక్కకు మళ్లించి క్రేన్ సాయంతో కారులో చిక్కుకుని తీవ్రగాయాలతో ఉన్న డ్రైవర్ షేక్ జిలాని, కుమారిని బయటకు తీసి 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. అలాగే మృతదేహాలను కూడా వెలికి తీసి కావలి ఏరియా ఆసు పత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు కుమార్ (ఫైల్)



మృతులు ఎర్రాబత్తిన సిరి అలియాస్ రాజ్‌కుమార్, కల్యాణి (ఫైల్)

## రేపు జిల్లాలో బాలకృష్ణ పర్యటన

- నెల్లూరు, కందుకూరులలో సభలో

కందుకూరు, ఏప్రిల్ 24 : 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర'లో భాగంగా సినీ హీరో, టీడీపీ సీనియర్ నేత నందమూరి బాలకృష్ణ ఈ నెల 26న జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం హెలికాప్టర్‌లో రామాయపట్నం అతిథిగృహానికి చేరుకోనున్న బాలకృష్ణ మధ్యాహ్నం వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3.30 గంటలకు కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరులో జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి నెల్లూరు రూరల్, సిటీ నియోజక వర్గాలలో జరిగే బహిరంగ సభల్లో బాలకృష్ణ పాల్గొంటారని టీడీపీ నాయకులు తెలిపారు. గుడ్లూరు సభను విజయవంతం చేసేందుకు కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కాకాణి ఇలాకాలో మరో మద్యం డంప్!

- ఈసారి పొదలకూరులో గుర్తించిన అధికారులు



అధికారులు గుర్తించిన మద్యం ఇదే!

పొదలకూరు, ఏప్రిల్ 24 : రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత ఇలాకాలో మద్యం డంప్‌లో పట్టుబడుతూనే ఉన్నాయి. మొన్న ముత్తుకూరు మండలం పంటపాళెంలో వైసీపీ నాయకుడి ఇంట్లో మద్యం గుర్తించగా, తాజాగా పొదలకూరులోనూ మద్యం కేసులు పట్టుబడ్డాయి. విరువూరులోని వైసీపీ నాయకుడు చిర్రా రాజగోపాల్‌రెడ్డి చెందిన రైస్‌మిల్లులో భారీ మద్యం డంప్‌ను సెబ్ అధికారులు, పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ఎఫ్ఎస్‌టీ మెంబర్స్ ఎన్‌వీ సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో మిల్లులోని అటకపై 54 మద్యం కేసులను గుర్తించారు. 2,069 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకుని, వీటి విలువ సుమారు రూ.4.05 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. రైస్‌మిల్లు యజమానికి సహాయకుడిగా ఉన్న పెంచలయ్యను అరెస్ట్ చేసి, సెబ్ సీఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ తనిఖీల్లో పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఈ మద్యం ఎక్కడిది!?**

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత మండలంలో ఆయన అనుచరుడు వద్ద పట్టుబడ్డ మద్యం ఎక్కడ నుంచి వచ్చిందనేది అంతుపట్టడం లేదు. కాకాణి తరఫున ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకే వీటిని నిల్వ చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల ముత్తుకూరు మండలం పంటపాలెంలో పట్టుబడ్డ మద్యం బ్రాండ్లే పొదలకూరులో కూడా గుర్తించారు. రాయల్ ప్యాలెస్, వైట్‌హాల్ బ్రాండ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో లభించేవి. ఒక వ్యక్తి వద్ద మూడు సీసాలకు మించి మద్యం ఉండకూడదు. అలాంటిది వైసీపీ నాయకులకు అన్ని వేల మద్యం సీసాలు ఎలా వచ్చాయి? ఎక్కడి నుంచి వచ్చాయి? డిస్టిలరీ నుంచి దుకాణాలకు వెళ్లాల్సిన సరుకును నేరుగా వైసీపీ నాయకులకు ఇళ్లకు చేర్చారా? లేదంటే దుకాణాల నుంచే తరలించారా!? ఇలా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వేమిరెడ్డి, బీద, కావ్యలకు హారతి ఇస్తున్న మహిళ

## వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదు

- అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి
- కావలి ప్రచారంలో కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి, కావ్య

కావలి, ఏప్రిల్ 24 : నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికలలో పతనం తప్పదని ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య క్రిష్టారెడ్డిలు తెలిపారు. కావలిలోని 26, 29 వార్డులలో బుధ వారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ కన్వీనర్ సీవీసీ సత్యం స్థానిక నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపుతామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అరాచకాలను అంతమొందించేందుకు టీడీపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తోందని దానిని అంతమొందించి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు చంద్రబాబును ముఖ్యమంత్రి గా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల నేత చంద్రబాబు నాయుడని అన్నారు. ఈ ప్రచారంలో కూటమి నేతలు మన్నవ రవిచంద్ర, గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, తటవర్తి వాసు, కే. బ్రహ్మానందం, పొబ్బా సాయి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్భాటం చేసి వదిలేశారు!?



వైకుంఠపురంలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్



బెడ్లపై పరుపులు, దిండు ఏవీ!?

ఎన్నికల కోడ్ వస్తోందని హడావుడి చేసి హెల్త్ సెంటర్‌ను ప్రారంభించేశారు. అయితే, ఆ తర్వాత అందులో కనీస వసతులు లేకపోవడంతో రోగులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. కావలిలోని వైకుంఠపురంలో రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన హెల్త్ సెంటర్‌లో అన్ని వసతులు సమకూర్చకుండానే ఎన్నికల కోడ్ సమీపిస్తుందనే ఉద్దేశంతో గత నెల 13వ తేదీన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ప్రారంభించేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అంటే ఒకటిన్నర గడుస్తున్నా హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 10 బెడ్లపై పరుపులు, దిండ్లు ఏర్పాటు చేయలేదు. కేవలం దుప్పటి పరిచి మమ అనిపించారు. అలాగే వైద్యాధికారితో కలిపి ఏడుగురు సిబ్బంది ఉండే ఈ హెల్త్ సెంటర్‌లో సమయపాలన బోర్డులు లేకపోవటంతో డాక్టర్, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఉంటారో కూడా తెలియడం లేదు. రక్తపరీక్షలకు సంబంధించి బోర్డు ఏర్పాటు చేయలేదు. అన్నిరకాల జబ్బులకు మందులు లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగాలు వాపోతున్నారు. రక్తపరీక్షలు చేసే ల్యాబ్‌లో మందులు, అట్టపెట్టెల గుట్టలు తప్ప ల్యాబ్ పరికరాలు లేవు.

\- కావలి రూరల్



అట్టపెట్టెలతో నిండి ఉన్న ల్యాబ్ రూం



డాక్టర్ లేకుండా ఖాళీ కుర్చీ, తిరుగుతున్న ఫ్యాన్

## ఎన్నికల సందేహాలను నివృత్తి చేసుకోండి

నెల్లూరు (క్రైం) : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చని జిల్లా పోలీసు పరిశీలకుడు అశోక్ టి దుధే ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు పరేడ్ మైదానంలోని గెస్ట్‌హౌస్‌లో ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అత్యవసర సమయంలో 7569618685 నెంబరుకు ఫోన్ చేయవచ్చని లేదా పోలీస్ అబ్జర్వర్73 జిమెయిల్.కమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## నీటి సమస్యా.. 91001 21702 ఫోన్ చేయండి!



నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 24, జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, గ్రామాల్లో నీటి సమస్యలు ఏర్పడితే ప్రజలందరూ 9100121702 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. సమస్యను వెంటనే అధికార యంత్రాంగం పరిష్కరిస్తుందని పేర్కొన్నారు.

## న్యాయాధికారుల నియామకం

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 24: నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జిల కోర్టులకు న్యాయాధికారులను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరులో చాలాకాలంగా ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు గుంటూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జీ. స్వాతిని నియమించారు. ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జిగా గుంటూరు జిల్లా రేపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎల్. జగదీష్ కుమార్‌ను నియమించారు. కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఈ సుధాకర్‌రావును నియమిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి.

## ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 24 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 30వతేదీవరకు పొడిగించినట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు కూడా ఈ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యార్థులు ఫీజులు చెల్లించి, పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## కిలో పొగాకు రూ.274

కలిగిరి, ఏప్రిల్ 24 : పొగాకు ధర పెరుగుతుండటంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. బుధవారం కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి రైతులు 447 పొగాకు బేళ్లు తీసుకొచ్చారు. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 356 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-75, సీఆర్-6, జంపింగ్ లాట్స్-10 కారణాలతో 91 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.274, కనిష్ఠ ధర రూ.218, సగటు ధర రూ.237.97గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.



## సోమశిలలో 8.345 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 24 : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి ప్రాజెక్టులో 8.345 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మర్రిపాడు, ఏప్రిల్ 24 : నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై డీసీపల్లి వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో తౌహిద్ (27) మృతి చెందాడు. ఆత్మకూరులోని 3వ వార్డు కౌన్సిలర్ గౌష్ బాషా కుమురుడు తౌహిద్, తన స్నేహితుడు పత్తిపాటి అశోక్ ఇద్దరూ నంద్యాలకు వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. డీసీపల్లి వద్ద వరి గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టరును ఢీ కొట్టటంతో తౌహిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్‌కు తీవ్రగాయాలు కావటంతో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# ఎన్నికలప్పుడే గుర్తొస్తాయా.. హామీలు!

- ప్రతి మండలానికి రెండు షాదీమంజిళ్ల నిర్మాణం
- ఆత్మకూరు వైసీపీ అభ్యర్థి విక్రమ్‌రెడ్డి హామీపై ముస్లింల అసహనం
- సంగంలో పదేళ్లయినా పూర్తికాని నిర్మాణ పనులు
- పాతవి పూర్తి చేయలేదు.. కొత్తవి ఎలా కడతారంటూ పెదవి విరుపు



పదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న మినీ షాదీ మంజిల్ భవనం

సంగం, ఏప్రిల్ 22: ముస్లింల కోసం నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రెండుచోట్ల షాదీ మంజిల్ నిర్మాణాలు చేపడతాం అని ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లోని ముస్లిం ఎదుట ఎన్నికల హామీ ఇస్తున్నారు ఆత్మకూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి. ఈ హామీలు అమలు అయ్యేనా అని మండలంలోని ముస్లిం సోదరులు ఒకచోటచేరి చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకే దిక్కులేదు గాని, ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఇలా అమలుకాని హామీలు ఇస్తున్నారని వాపోతున్నారు. వివరాలిలా ఉన్నాయి. అన్న ఐదేళ్లు ఎమ్మెల్యే, మూడే ళ్లు మంత్రి చేశారు. తమ్ముడు రెండేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. కానీ నిధులు మంజూరు కాక పోవ డంతో సంగంలో పదేళ్లుగా మినీ షాదీమంజిల్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీనికి నిధులు మంజూరు చేయాలని ఇక్కడి ముస్లింలు అప్పటి మంత్రి గౌతమ్‌రెడ్డిని, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న విక్రమ్‌రెడ్డికి గడపగడప కార్యక్రమంలో విన్నవించారు. కానీ ప్రయోజనం లేకపోయింది. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ముస్లిం ఓట్ల కోసం ఇటీవల దువ్వూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో మేకపాటి విక్రమ్‌రెడ్డి షాదీ మంజిళ్ల నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ వాగ్దానం విన్న సంగంలోని ముస్లింలు అసంపూర్తిగా ఉన్న మినీ షాదీమంజిల్‌ను పూర్తి చేయడానికే నిధులు మంజూరు తీసుకరావడం చేతకాలేదు కానీ, రెండు కొత్త షాదీమంజిల్ కడతారంటా అంటూ పెదవి విరుస్తున్నారు. పదేళ్ల కిందట అప్పటి మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి స్థానిక ముస్లిం కోసం మినీ షాదీ మంజిల్ నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేశారు. స్లాబు వరకు పూర్తి చేశారు. నిధులు చాల క ఆగిపోయింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అంతే అప్పటి నుంచి దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయన అకాల మరణం తరువాత ఎమ్మెల్యేగా ఎన్నికైన విక్రమ్‌రెడ్డి కూడా అసంపూర్తిగా ఉన్న షాదీ మంజిల్ నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు ఏకంగా రెండు షాదీ మంజిల్ నిర్మిస్తాని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేయడంతో ముస్లిం సోదరులకు నమ్మకం కుదరడం లేదు.

## ఉదయగిరిలో ఐదు నామినేషన్ల దాఖలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులుగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రెండు సెట్లు, ఆయన కుమారుడు అభినవ్‌రెడ్డి ఒక సెట్, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ రెండో సెట్, పిరమిడ్ పార్టీ అభ్యర్థి నల్లపనేని వెంకటేశ్వర్లు నామినేషన్లు దాఖలు చేశారు.

### మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నామినేషన్

నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. దుత్తలూరు మండలం వెంకటంపేట ఆంజనేయస్వామికి కుటుంబసభ్యులతో కలిసి పూజలు, పట్టణంలోని అబ్దుల్ ఖాదర్‌ఖాన్ షావలి దర్గాలో ప్రార్థనలు చేసి తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమా ర్‌కు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ మోడి రామాంజనేయులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో ఐదు..

ఆత్మకూరు, ఏప్రిల్ 23: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి రెండవ నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా మేకపాటి పృథ్వీరెడ్డి నామినేషన్ వేశారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా షేక్ సుకూర్, ఇండిపెండెంట్ అభ్యర్థులు రామనారాయణరెడ్డి ధనిరెడ్డి, రామనారాయణ రెడ్డి నాగసాని నామినేషన్ వేశారు. అనంతరం పత్రాలను ఎన్నికల అధికారి మధులతకు అందజేశారు.

### మేకపాటి విక్రమ్‌రెడ్డి నామినేషన్..

ఆత్మకూరు: వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మధులతకు రెండు సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మేకపాటి పృథ్వీరెడ్డి, మేకపాటి కీర్తిరెడ్డి ఉన్నారు.

# టీడీపీ వస్తే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- టీడీపీని ఆశీర్వదించి గెలిపించండి
- ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి రామనారాయణరెడ్డి


ఉడ్‌హౌస్‌పేట్‌లో ఆనం రామనారాయణరెడ్డికి ఘన స్వాగతం చెబుతున్న నాయకులు, మహిళలు

సంగం, ఏప్రిల్ 24: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సు ల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఉడ్‌హౌస్‌పేట, తరుణవాయి, చెన్నవరపాడు, తలుపూరుపాడు, కొరిమెర్ల, నీలాయపాళెం గ్రామాల్లో ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉడ్‌హౌస్‌పేట గ్రామానికి


ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఆనం

వచ్చిన ఆయనకు గ్రామస్థులు, మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ బస్సు చార్జీలతో పాటు పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. నవరత్నాల పేరుతో ఒక్క చేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో వంద రూపాయలు లాక్కొన్నారని మిమర్శించారు. ప్రజలను ఆదుకునేందుకు టీడీపీ ఆధ్వ ర్యంలో ఎన్డీయే కూటమి సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించిందన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్లు నిం డిన ఆడ పిల్లలల నుంచి 60ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.1500లు, తల్లికి వందనం ప్రథకంలో ఎంత మంది పిల్లలను బడి పంపిస్తే అంతమందికి ఏడాదికి రూ.15 వేల లెక్కన ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి కింద రూ.20వేలు, వికలాంగులకు నెలకు రూ.4వేల పింఛను, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్లు అందచేస్తారన్నారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తారని తెలిపారు.

## దశాబ్దాలుగా అభివృద్ధికి నోచని రహదారి

అనంతసాగరం: బెడుసుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి 3.5కిలోమీటర్లు ఉంది. ఈ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని దశాబ్దాలుగా అడుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. గ్రామంలోకి ఆర్టీసీ సర్వీసులు నడవక పోవడంతో విద్యార్థులు ఆటోల్లో అనంతసాగరం వచ్చి విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఓట్ల సమయంలో నాయకులు హామీలు ఇస్తున్నారే గానీ మా సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. 2021 వచ్చిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైతే రూ.20లక్షలతో గ్రావెల్ రోడ్డేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇటీవల మా గ్రామంలో జరిగింది. ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కార్యమానికి వచ్చారు. ఈ సమస్యను ఆయనకు చెప్పినా పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు.


అభివృద్ధి నోచుకోని బెడుసుపల్లి రోడ్డు

# మైనార్టీల సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం


ఉదయగిరి: పార్టీలో చేరిన వారితో రియాజ్, టీడీపీ నాయకులు


ఉదయగిరి: ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాకర్ల

ఉదయగిరి రూరల్: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీకి కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సంఘ ఉపాధ్యక్షుడు షేక్ రియా జ్ తెలిపారు. బుధవారం రాత్రి ఉదయగిరి పట్టణంలోని కంసాలీవీధిలో వైసీపీకి చెందిన 60కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించి మాట్లాడారు. టీడీపీ హయాంలో రంజాన్‌తోఫా, దుల్హా న్ వంటి పథకాలు ప్రవేశపెట్టి ముస్లిం అభివృద్ధికి పాటుపడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ మారు జరగనున్న ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుంద న్నా రు. కార్యక్రమంలో పరిశీకుడు సింహాద్రి, టీడీపీ నాయకులు సయ్యద్ సందానీ, మాదాల రామచంద్రయ్య, అలీజాన్, ఇలియాజ్, లాడెన్, యస్థాన్, మాబాషా పాల్గొన్నారు.

### రెండోసెట్ నామినేషన్ దాఖలు చేసిన కాకర్ల

ఉదయగిరి: నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో రాజారమేష్ ప్రేమ్ కుమార్‌కు అందజేశారు. సోమవారం అట్టహాసంగా భారీ జనసందోహం మధ్య ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన ఆయన బుధవారం రెండో సెట్ దాఖలు చేశారు. కార్యక్రమంలో కాకర్ల ప్రణీత, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు గడ్డం శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలువాయి: వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ నామినేషన్ కార్యక్ర మానికి మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం తరలి వెళ్లారు. బస్సులు, కార్లు, ఆటోల్లో వీరందరూ వెంకట గిరి వెళ్లారు. కోలాహలంగా నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరారు.

### ఉమ్మడి అభ్యర్థుల కోసం ప్రచారం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురే ష్‌లకు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ పేలపూడి వెంకట రత్నం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నందిపాడు, దుత్తలూరు, చింతలకుంట గ్రామాల్లో ఇంటింటా తిరిగి సూపర్‌సిక్స్ పథకాల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీకుర్తి రవీంద్ర బాబు, ఉండేలా గురవారెడ్డి, చీదర్ల మల్లికార్జున, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, కాకర్ల మధు, మండవ మధు, చల్లా ప్రసాద్, అన్నపురెడ్డి వెంగళరెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: తెలుగుదేశం జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి నెలటూరి జాషువా ఆధ్వర్యంలో బుధవారం బెడుసుపల్లిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండలకు చెట్టు కింద కూర్చొని సేద తీరుతున్న గ్రామ రైతులతో మాట్లాడారు. తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకా ల గురించి పార్టీ వస్తే రైతులకు జరిగే ప్రయోజనాల గురించి వివరించారు. టీడీపీ యువత, నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎం గా చంద్రబాబు నాయుడిని గెలిపించుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కలవెల జ్యోతి, వెంకటేశ్వర్లు, ఇబ్రాయిల్, చెన్నకేశవులు, తూరక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కలువాయి నుంచి వెంకటగిరి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు



## కారు, మోటారు బైక్ ఢీ : యువకుడికి గాయాలు


కారును ఢీకొన్న మోటారు బైక్

సంగం, ఏప్రిల్ 24: తరుణవాయి క్రాస్ రోడ్డు దాటిన తరువాత ముంబాయి రహదారిపై ఎదురెదురుగా వస్తున్న కారు, మోటారు బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటారు బైక్ నుజ్జునుజ్జు అయ్యింది. నడుపుతున్న యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వాహనాలను ఒవర్ ట్రాక్ చేసే క్రమంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కారు బెలూన్ ఓపెన్ కావడంతో కారులో ఉన్నవారికి ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. బాధితుడి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

## సంగంలో రూ.1.67లక్షల స్వాధీనం


పట్టుబడిన నగదుతో ఎస్ఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది

సంగం, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మద్యం, నగదు అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్థానిక పోలీస్ చెక్‌పోస్టులో బుధవారం రూ.1.67 లక్షలు పట్టుకున్నారు. వాహనతనిఖీల్లో భాగంగా ముంబాయి రహదారిపై వెళ్తున్న కారు ను తనిఖీ చేయగా ఓ కారుల్లో ప్రభంజన్‌కుమార్ అనే వ్యక్తి రూ.1.67 లక్షలు నగదును ఆత్మకూరు వైపు తీసుకెళ్త న్నారు. అందుకు సం బంధించిన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

## దర్గాలో హఫీజ్ పాషా దౌర్జన్యం

- గాలేఫాలు,ప్రసాదాలు ఎత్తుకేళ్లే ప్రయత్నం
- అడ్డుకున్న వక్ఫ్ బోర్డు అధికారులు


వక్ఫ్ బోర్డు అధికారులతో వాదిస్తున్న హఫీజ్ పాషా

ఏఎస్ పేట, ఏప్రిల్ 24: స్థానిక ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో మంగళవారం రాత్రి దర్గా సజ్జాద హఫీజ్ పాషా గాలేఫలు, ప్రసాదాలు తనకు చెందినవని వాటిని తను తీసుకెళ్తానని తన అనుచరులతో దర్గాలోకి ప్రవేశించారు. దీనితో వారిని దర్గా ఈవో హసేన్, అసిస్టెంట్ ఈవో షరీఫ్ అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరుకులు తీసుకెళ్లడానికి తనకు కోర్టు ఆర్డర్ ఉందని పోలీసులను సైతం తనకు మద్దతుగా తీసుకొచ్చారు. కోర్టు ఆర్డర్ ప్రకారం దర్గా సజ్జాదగా ప్రార్థనలు మాత్రమే చేసుకోవాలని దర్గాలోని ఏ వస్తువులు తీసుకెళ్లడానికి మీకు హక్కు లేదని ఈవో తెలపడంతో ఇరువురికి కొంత సమయం వాగ్వాదం జరిగింది. గతంలో ఇదేవిధంగా దౌర్జన్యం చేయడంతో ఈవో ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. సజ్జాదగా హఫీజ్ పాషా మాత్రమే దర్గాలో ప్రార్థనలు చేయాలి కాని అతను కాకుండా అతను తరుపున వేరే వ్యక్తులు ప్రార్థనలు చేస్తున్నారు. దీని గురించి వక్ఫ్ బోర్డు అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. వక్ఫ్‌బోర్డు అధికారుల అండతోనే నియమాళికి విరుద్ధంగా వేరే వ్యక్తులు విధులు నిర్వహిస్తున్నారని, వారికి వాటాలలో తేడా వచ్చినప్పుడు మాత్రమే ఇలా గొడవలు పడుతుంటారని వక్ఫ్ బోర్డు అధికారుల పనీతీరుపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

### మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై కేసు నమోదు

మర్రిపాడు, ఏప్రిల్ 24: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘింగించినందుకు వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి తండ్రి మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డిపై మర్రిపాడు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఇటీవల అల్లంపాడులో ఆయన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మను పదే పదే కులం పేరుతో ప్రస్తావిస్తూ ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. "నెత్తిన రూపాయి పెడితే ఐదు పైసలకు చెల్లదు" అంటూ ఆంధ్రజ్యోతిలో 20వ తేదీ వచ్చిన శీర్షికపై స్థానిక ఎంపీడీవో మనోహర్‌రాజు స్పందించారు. ఆయన విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి సోమవారం కేసు నమోదు చేశారు. అయితే కులం పేరుతో దూషించారని నాలుగురోజుల క్రితం రాజమోహన్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వెంకటరమణమ్మ ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా పోలీసులు పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయి.

### పోలీసుల తనిఖీలో రూ.5 లక్షల పట్టివేత

కావలిరూరల్, ఏప్రిల్ 24: సాధారణ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కావలి పట్టణం రైల్వే రోడ్డులోని మసీదు సెంటర్‌లో 1వ పట్టణ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు, ఎన్నికల నిర్వహణ అధికారి అనుమతి లేకుండా రూ.5లక్షలతో వస్తున్న దగదర్తి మండలం బోడిగుడిపాడుకు చెందిన దుర్గి హరిప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు.

## నగదు, మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు చేపట్టిన తనిఖీల్లో రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.11.59 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.2 లక్షలు, సంతపేట పరిధిలో రూ.92 వేలు, కోవూరు పరిధిలో రూ.2 లక్షలు, కావలి 1 టౌన్ పరిధిలో రూ.5 లక్షలు, సంగం పరిధిలో రూ.1.67 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దగదర్తి పరిధిలో 42 క్వార్టర్ల మద్యం, సైదాపురంలో 10, బిట్రగుంటలో 35, కేపీ పోర్టులో 21, జలదంకిలో 8, కలిగిరిలో 11, సెబ్ అదికారులు 182 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 1900 లీటర్ల బెల్లపు ఊటను కూడా స్వాధీనం చేసుకున్నారు.

### పాత కక్షలతోనే యువకుడి హత్య?

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24: నెల్లూరులోని ఆటోనగర్‌లో మంగళవారం జరిగిన యువకుడి హత్య కేసులో వేదాయపాళెం పోలీసులు ఓ నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 23వ తేదీ తెల్లవారు జామున దశరథ అనే యువకుడు ఆటోనగర్‌లోని ఖాళీస్థలాల్లో దారుణ హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. దశరథ తల్లి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శరీరంపై కత్తితో పలుచోట్ల నరికి, గుండెల్లో కత్తిని దించాల్సిన అవసరం ఎవరికి ఉందన్న కోణంలో విచారణ చేపట్టారు. మృత దేహం లభ్యమైన పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను, దశరథ ఫోన్ కాల్ లిస్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పాతకక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

### రూ.లక్ష గడ్డివాము దగ్ధం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24 : నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో బుధ వారం ప్రమాదవశాత్తు 15 ఎకరాల వరి గడ్డి వాము దగ్ధమైంది. కారణాలు తెలియదు కానీ, సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసింది. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు దరి సి సుబ్రహ్మణ్యం తెలిపారు.

### గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వీఆర్పీ): నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని చిట్టేడు (బాలురు), శ్రీకాళహస్తి (బాలికల)లోగల గిరిజన గురుకుల కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు గిరిజన (యానాదులు) విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు అధికారి డాక్టర్ రాణి మంద ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మే 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ఎస్సీ, బీసీ, ఓసీలకు ఒక్కొక్క సీటు మాత్రమే కేటాయిస్తామని తెలిపారు. సందేహాలనివృత్తికి 94410 33367 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 133 |
| లేయర్ లైవ్ | 93 |
| స్కిన్ చికెన్ | 236 |
| స్కిన్‌లెస్ | 264 |
| లేయర్ | 158 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 6827 |
| వెండి కిలో ధర | రూ. 83,100 |
| వెండి ఒక గ్రాము | రూ. 85.10 |

## కావలిలో 6 నామినేషన్లు

**కావలి, ఏప్రిల్ 24:** కావలి అసెంబ్లీకి 7వ రోజు బుధవారం వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 6 నామినేషన్లు వేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పొదలకూరి కల్యాణ్, స్వతంత్ర అభ్యర్థులుగా పోకల రఘువర్మ, వాయిల తిరుపతి, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ముప్పసాని నరేంద్ర రెండో సెట్ నామినేషన్, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా మైనంపాటి ఏసు రత్నం రెండో సెట్ నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందచేశారు.



30 ఏళ్లుగా గిరిజనులు రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసుకొన్న గుడిసెలు

## ఉన్నోళ్లకే ఇళ్లు..

# కాలువ గట్లపై గుడిసెలు!

- నవరత్నాలకు వీరు అర్హులు కారా?
- దశాబ్దాల తరబడి కాలువ గట్లు, రోడ్డు మార్జిన్లలోనే నివాసం
- ప్రభుత్వాలు మారినా మారని గిరిజనుల తలరాత



**మోసం గురూ!**



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు రాపూరు వెంకట రమణమ్మ. ఈమె గిరిజన మహిళ. గోగులపల్లి రోడ్డు మార్జిన్లోని స్థలంలో గుడిసె వేసుకొని తన కుటుంబంతో జీవిస్తోంది. గత ఏడాది వర్షాలకు గుడిసె దెబ్బతిని వీరి కుటుంబం రోడ్డున పడింది. ఆమెకు ఎలాంటి గృహం మంజూరు కాలేదు. కానీ ఈమెను ఎందుకు అధికారులు గుర్తించి ఇళ్లు మంజూరు చేయలేదో తెలియదు. కనీసం నాయకులు కూడా పట్టించుకోలేదు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బండోలు శేషయ్య. ఈయనకు తూర్పు గోగులపల్లిలో రోడ్డు పక్కనే కాలువ గట్టుపై పూరి గుడిసె ఉంది. కేవలం నాలుగు కర్రలపై కప్పు వేసుకుని కుటుంబంతో బతుకుతున్నాడు. ఇతనికి పూటగడవడమే కష్టం. కానీ ఇతనికి జగనన్న గృహం మంజూరు కాలేదు. ఉన్నవారికి గృహాలు మంజూరు చేయడంలో ఉన్న ఆసక్తి ఇతనికి మంజూరు చేయడంలో ఎందుకు లేదో తెలియదు.

**అల్లూరు, ఏప్రిల్ 24:** నవరత్నాల పథకంలో పేదలందరికీ ఇళ్లు అన్నారు.. కానీ ఇళ్లు మాత్రం ఇవ్వలేదు. దశాబ్దాల తరబడి కాలువ గట్లు, రోడ్డు మార్జిన్‌లలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేద గిరిజనుల గురించి పట్టించుకోలేదు కానీ ఆర్థికంగా ఉన్నోళ్లకు మాత్రం ఇళ్లు ఇచ్చే శారు. ఇది వైసీపీ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి పక్కా గృహం ఉండాలన్న దృఢసంకల్పానికి నిదర్శనం. సొంతిల్లు ఉన్నవారికి మళ్లీ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వానిదే. ఈ క్రమంలో పేదలు పేదలుగానే మిగిలిపోయారు తప్ప ఈ పథకం ద్వారా అసలైన ఇల్లులేని అర్హుడికి ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వాలు దశాబ్దాల నుంచి పేదలందరికీ సొంతిల్లు ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో అనేక రకాల పథకాలు ప్రవేశ పెడుతున్నా కొందరు గిరిజనులకు మాత్రం ఈ పథకాలు దరిచేరడం లేదు. దీంతో వేల కుటుంబాల గిరిజనులు సమాజానికి దూరంగా కాలువ గట్లపైన, గుంట కట్టలపైన గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. వారి గుడిసెలకు వాడే తాటాకులైనా రెండేళ్లకో మూడేళ్లకోసారో మారుతున్నాయి కానీ వీరి జీవితాల్లో మాత్రం ఏమాత్రం మార్పు కానరావడం లేదు.

● అల్లూరు మండలం సింగపేటలో గిరిజనులకు ఇంటి నివేశన స్థలాల కోసం కేటాయించిన స్థలం ఇప్పటి వరకు చదును చేయలేదు. వీరి నుంచి ఓట్లు మాత్రం వేయించుకుంటారు తప్ప వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అటు వైసీపీ ప్రభుత్వం కానీ ఇటు ఆ పార్టీ నాయకులు కానీ ముందుకు రాకపోవడంతో గుంటమిట్టలుగా ఆ స్థలం అలానే మిగిలిపోయింది. దీంతో ప్రతి ఒక్కరికీ గృహాలు అనే మాట గిరిజనులకు కాదన్నట్లు మారింది.

● అల్లూరు మండలం తూర్పు గోగులపల్లిలో రోడ్డు మార్జిన్లో దాదాపుగా 30 ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 30 కుటుంబాలు ఈ గుడిసెల్లోనే మగ్గుతున్నాయి. వానొచ్చినా.. వరదొచ్చినా.. ఎండ కాసినా.. అగ్ని ప్రమాదాలు జరిగినా వీరి పరిస్థితి ఆగమ్యగోచరమే. గత వేసవిలో ఈ ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగి నాలుగు గుడిసెలు కాలిపోయాయి. దీంతో ఆ నాలుగు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అదే గ్రామంలో గుంటకట్టపై జీవించే గిరిజనులలో ఇటీవల ఇద్దరు పాముకాటుకు గురయ్యారు. గుడిసెల్లోకి దూరిన విషసర్పాల కారణంగా వీరి ప్రాణాలకు ముప్పు పొంచి ఉందనే చెప్పవచ్చు. ఇలాంటి దుర్భర జీవనం సాగిస్తున్న వారికి ఇళ్లు ఇస్తామని చెపి చేయకపోడం మోసం కాదా?.

### గిరిజనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



పేద గిరిజనులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నాయకులు, రైతులు వీరి వద్దకు వెళ్లి పనులకు తీసుకెళుతున్నారు తప్ప వారికి సహాయం చేసే వారు లేరు. వీరిని అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అందరిలా వీరికి గృహాలను నిర్మించుకునే స్థోమత లేదు. ప్రభుత్వం ఇచ్చే గృహాలను వీరికి కేటాయించి కాంట్రాక్టరు ద్వారా గృహాలు నిర్మించి ఇస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఉంటాయి.

\- ఎస్.మల్లి, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు

## 300 కుటుంబాలు టీడీపీలో చేరిక

**జలదంకి, ఏప్రిల్ 24:** కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో బుధవారం బ్రాహ్మణక్రాక పంచాయతీ బీకే అగ్రహారం సుబ్బయ్య గిరిజన కాలనీకి చెందిన 300 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎస్టీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో వారందరికీ వంటేరు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను వారు వంటేరు దృష్టికి తీసుకురాగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, స్వర్ణ కొండపనాయుడు, బీజేపీ నాయకుడు మారెళ్ల బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన బీకే అగ్రహారం సుబ్బయ్యకాలనీ ఎస్టీలకు పార్టీ కండువాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు

## బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

● జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్

**కొండాపురం, ఏప్రిల్ 24:** బీసీ, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని జడ్పీ మాజీ చైర్మన్ పీ.చెంచలబాబు యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సత్యవోలులో ఉదయగిరి నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గద్దె రామక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన మండలస్థాయి ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని దూరం చేసుకోవడం వలన వైసీపీ ప్రభుత్వంలో బీసీ, బడుగు, బలహీన వర్గాలు చాలా వెనుకబడిపోయామన్నారు. అభివృద్ధి, సంక్షేమం, కులవృత్తుల పరంగా తీవ్ర నష్టం జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో ఐక్యంగా ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకొని నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, కాకర్ల వెంకట్, పార్టీ పరిశీలకుడు కే.సుబ్బారావు, గంజాం రాఘవేంద్ర, పదర్ల తిమోతి, బద్దిపూడి మాచెర్ల, మందపల్లి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

**కందుకూరు, ఏప్రిల్ 24:** కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం చినలాటిరిపి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు బుధవారం ఆపార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. చినలాటిరిపి ఎస్సీ కాలనీకి చెందిన వార్డుమెంబరు పూరిమిట్ల నారాయణ ఆధ్వర్యంలో పూరిమిట్ల సుబ్బారావు, మధు, శివ, శ్రీరాములు, రాము, మనోజ్, మనోహర్ తదితర కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో ఇంటూరి

**లింగసముద్రం :** కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలంలోని పెంట్రాల గ్రామ పంచాయతీ పరిధిలోని చీమలపెంటకు చెందిన మానికొండ బ్రహ్మయ్య చౌదరి కందుకూరు ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నాగేశ్వరరావు ఆయనకు టీడీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని రమణయ్య, ముత్తులూరి సుధాకర్, గోపి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికే సమాజంలో గౌరవం



రమణయ్య, స్వర్ణలతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**కలిగిరి, ఏప్రిల్ 24:** సమాజంలో అన్ని వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తికే గౌరవ మర్యాదలు ఉంటాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని క్రాకుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు యెండ్లూ రు రమణయ్యకి బుధవారం స్థానిక ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి నిత్యం విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన రమణయ్య ఆదర్శనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పవిత్ర విద్యాసంస్థల చైర్మన్ యెండ్లూరి వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పీ చెంచలబాబుయాదవ్, మాజీ మండలాధ్యక్షుడు ఎంవీ రామిరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, గంజాం రాఘవేంద్ర, యెండ్లూరు భాస్కరనాయుడు, మాదాల శ్రీనివాస్, మాదాల శ్రీహరి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాతబిట్రగుంటలో టీడీపీ ప్రచారం

**బిట్రగుంట, ఏప్రిల్ 24:** బోగోలు మండలం పాతబిట్రగుంట పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నివర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి, రేమాల పద్మారెడ్డి, కొర్మపాటి బసిరెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, పాలకీర్తి రమణయ్య, రావి విజయ్‌కుమార్ యాదవ్, రేమాల సంజీవరెడ్డి, తిరుపతి, మందా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు

● దగదర్తి మండలం ఉలవపాళ్ల అరుంధతివాడలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మలేపాటి సుబ్బానాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలనల్లో దళిత వాడల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో పాటు వీధిదీపాలు వెలగక అవస్థలు పడుతున్నారన్నారు.

# వైసీపీ పాలనలో దళితుల జీవనం విచ్ఛిన్నం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

**అల్లూరు, ఏప్రిల్ 24 :** దళితులకు విద్య, ఉపాధి అవకాశాలను దూరం చేసి వారి జీవన విధానాన్ని విచ్ఛిన్నం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డితో కలసి బుధవారం మండలంలోని ఇందుపూరు, పురిణి పంచాయతీల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందించారన్నారు. దళిత యువత ఉన్నతస్థాయి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్‌ను సీఎం జగన్ వేసివేశారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఏదో ఒక పథకం ఇచ్చేవారని, ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి పథకాలు లేకుండా చేసిన దేశంలో ఒకే ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విదేశీ విద్య, కార్పొరేషన్లు మూయించి వేశారన్నారు. సభల్లో తాను మీ మేనమామ అని ఒకసారి, మీ బిడ్డని కాపాడుకోండని, పెత్తందారుకి పేదవారికి యుద్ధమని మరోసారి అంటుంటాడని, పేదోళ్ల పథకాలు మూసేసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని, ఇటువంటి ముఖ్యమంత్రిని తరిమికొట్టి పేదల అభ్యున్నతి కోసం పాటుపడే చంద్రబాబును గెలిపించుకుని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

### కావలి ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డి అనర్హుడు : కావ్య

పదేళ్లుగా కావలి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆ పదవికి అనర్హుడని టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని, రోడ్డు, తాగునీరు, అభివృద్ధి తదితర కార్యక్రమాలు గత టీడీపీ ప్రభుత్వంలో వేసినవని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపించిన ముఖ్యమంత్రి చంద్రాబాబునాయుడు అన్నారు. కొట్టేవాడు జగన్.. పెట్టేవాడు చంద్రబాబు... అని కొనియాడారు. చంద్రబాబు పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వస్తే పింఛన్ రూ.4 వేలుతోపాటు మహిళలకు నెలకు రూ.1500, చదువుల కోసం రూ.15 వేలు, మూడు సిలిండర్లు, ఉద్యోగ అవకాశాలు తదితర పథకాలు అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి అమర్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, గునపాటి ఫణికుమార్, భవాని శంకర్‌రెడ్డి, కోడూరు హజరత్‌రెడ్డి, చెన్నారెడ్డి రవీంద్రరెడ్డి, యేటూరు శ్రీనివాసులురెడ్డి. యేలూరు శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలోకి తూర్పు గోగులపల్లి సర్పంచు, వార్డు సభ్యులు

మండలంలోని పురిణి, ఇందుపూరులలో జరిగిన టీడీపీ ప్రచారంలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిల సమక్షంలో తూర్పు గోగులపల్లి సర్పంచు తోట మహాలక్ష్మమ్మ, ఆమె భర్త తోట శీనయ్యలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తూర్పు గోగులపల్లిలోని వారి నివాసంలోనే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ రెబల్ అభ్యర్థిగా తూర్పు గోగులపల్లి పంచాయతీ నుంచి పోటీ చేసి గెలుపొందిన సర్పంచు మహాలక్ష్మమ్మ, ఆమె భర్త తోట శీనయ్యలు పార్టీలోకి రావడం స్థానికంగా బాలన్ని చేకూర్చినట్టయింది. అదేవిధంగా వార్డు సభ్యులు కోమిట్ల శ్రీధర్‌రెడ్డి, గోళ్ల వెంకట రమణయ్య, రామలింగం బలరామిరెడ్డి, ముంతా పద్మలతోపాటు స్థానిక నాయకులు పుట్టా వెంకటేశ్వర్లురెడ్డి, కోటా రమేష్‌రెడ్డి, పినికాటి వెంకటేశ్వర్లురెడ్డి, గూడూరు ప్రవీణ్, గోళ్ల తిరుమలరావు, కమతం సూలాం, కత్తి రామయ్య, ఆవుల కొండయ్య, ఆవుల మాల్యాద్రి, ముంతా రమేష్, ముంతా హరి, పెల్లేటి మధు, పల్లిబోయిన శ్రీనివాసులు రెడ్డి, కరేటి శ్రీహరి, గునిమిని ఉమాశంకర్‌రెడ్డి, గరుతోటి సురేంద్ర, దాసరి మునెయ్యలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మూకుమ్మడిగా పంచాయతీ కార్యవర్గం టీడీపీలో చేరడంతో తూర్పు గోగులపల్లిలో వైసీపీకి తీవ్ర దెబ్బ తగిలింది. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పావనబోయిన రత్తయ్య, కార్తీక్ శర్మ, అరగల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



కావలి : టీడీపీలో చేరిన నాయకులతో వేమిరెడ్డి, కావ్య, రవిచంద్ర



సర్పంచు మహాలక్ష్మమ్మ, శీనయ్యలను ఆహ్వానిస్తున్న బీద, కావ్య

### ● విశ్వనాథరావుపేటకు చెందిన..



టీడీపీలో చేరిన బొంతా సుధీర్, జయకుమార్

బోగోలు మండలం విశ్వనాథరావు పేటకు చెందిన వార్డు సభ్యుడు బొంతా సుధీర్, ఎం.జయకుమార్‌లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి బీద రవిచంద్ర, కావ్య క్రిష్ణారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోగోలు నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు, లేళ్లపల్లి సుధీర్, టి.శ్రీధర్, మాజీ ఎంపీపీ పీ.శ్రీనివాసులు, నాటకరాని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీలో చేరిక

**కావలి :** అల్లూరు మండలానికి చెందిన పలువురు వైసీపీ ముఖ్యనాయకులు బుధవారం కావలి టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డి, జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్రలు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అల్లూరు చెన్నకేశవుల స్వామి దేవస్థానాల ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, రామకృష్ణ జూనియర్‌కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మేడా రామకృష్ణారెడ్డి, నూకలపాటి వెంకటేశ్వరరెడ్డి, సహకార పరపతి సంఘం చైర్మన్ మేడా శ్రీనివాసులురెడ్డి, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్, రైతు నాయకుడు యరటపల్లి శేఖర్‌రెడ్డిలు వైసీపీని వీడారు. అలాగే అల్లూరు మండలం నార్త్‌మోపూరుకు చెందిన వైసీపీ నాయకురాలు యెల్లు మధులత మరో 200 మంది రేబాల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలిలో టీడీపీలో చేరారు.

# ఆశాజనకంగా పొగాకు ధరలు

**కలిగిరి, ఏప్రిల్ 24:** వాణిజ్య పంట పొగాకు సాగు చేసిన రైతులకు ప్రస్తుత గిట్టుబాటు ధర ఆశాజనకంగా ఉంది. ఏడాదికేడాది పొగాకు పంట సాగులో ఖర్చులు విపరీతంగా పెరిగిపోతోంది. పొగ మొక్క నాటే సమయం నుంచి తోటల్లో పొగాకు రెలచడం, బ్యారన్‌లలో ఆకు కాల్చడం, మండెలు, చెక్కులు వేయడంతోపాటు, వేలం కేంద్రానికి తీసుకొచ్చేవరకు ప్రతి విషయంలో ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. గత నాలుగైదేళ్ల క్రితం ఒక బ్యారన్‌కు పొగాకు సాగు చేయాలంటే సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు కాగా, ప్రస్తుతం కూలీలు, ఖర్చులు అమాంతం పెరిగిపోయి ఒక్కొక్క బ్యారన్ సాగుకు రూ.11లక్షలు ఖర్చు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే పొగాకు కిలో గరిష్ఠ ధర గతేడాది అనూహ్యంగా రూ.280కి పైగా పలికింది. దాంతో రైతులు ఈ ఏడాది గతేడాది కన్నా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. గతేడాది 4 మిలియన్ కేజీలు దిగుబడి సాధించగా ఈ ఏడాది 7.4 మిలియన్ కేజీల దిగుబడి రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది అమ్మకాల చివర్లో పొగాకు ధర అమాంతం పెరగడంతో ముందుగా అమ్మకాలు చేసుకున్న రైతులు నష్టపోయారు. అయితే ఈ ఏడాది కొనుగోళ్ల ప్రారంభం నుంచి నాణ్యమైన పొగాకుకు కేజీ రూ.230కి మొదలై ప్రస్తుతం రూ.274వరకు అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కేజీ పొగాకు ధర రూ.300వరకు పలుకుతుందని, ఆశాభావం వ్యక్తం చేస్తూ, పొగాకు రేట్లు ఇదేస్థాయిలో ఉంటే నష్టాల నుంచి గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు.



కలిగిరి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

## వైసీపీ అభ్యర్థి బుర్రా నామినేషన్ దాఖలు

**కందుకూరు, ఏప్రిల్ 24:** వైసీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పామూరురోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి ఓపెన్‌టాప్ వాహనంపై నిర్వహించిన ర్యాలీలో వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డితో పాటు కందుకూరు సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొన్నారు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో మహీధరరెడ్డి దిగిపోయారు. అనంతరం ఏరియా హాస్పిటల్, అంకమ్మ దేవాలయం, పోస్టాఫీసు సెంటర్‌ల మీదుగా సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది.

## మద్యం సీసాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితుడితో ఎస్ఐ భోజ్య

**బిట్రగుంట, ఏప్రిల్ 24:** బోగోలు మేజర్ పంచాయతీ రైల్వే ఎల్సీగేట్ 144 పడమర వైపు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిప్ప ఎస్సై భోజ్య వివరాల మేరకు.. సుందరగిరివారి కండ్రికకు చెందిన పసుపులేటి ప్రభాకర్‌ను అనుమానంతో తనిఖీ చేయగా అతని వద్ద 30 మద్యం సీసాలు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి



ఎన్డీఏకి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు

**కావలి, ఏప్రిల్ 24:** ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు ప్రచారం చేపట్టారు. కావలి రూరల్ మండలం చలంచర్లలో బుధవారం ఇంటింటికి తిరిగి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగల అభివృద్ధి చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణ ఎన్డీఏ కూటమితోనే సాధ్యమవుతోందన్న పిలుపులో భాగంగా ఈ ప్రచారం చేపడుతున్నట్లు చెప్పా రు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎం, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఇన్‌చార్జి అక్కిలగుంట ఏసు రత్నం మాదిగ, కో ఇన్‌చార్జిలు ఏసుపోగు జయరాజు మాదిగ, చేవూరి కిరణ్ మాదిగ, కత్తి శివయ్య మాదిగలు, తదితరులు పాల్గొన్నారు.

# మామిడికి మద్దతేది ?

- అందని రాయితీలు
- పట్టించుకోని ప్రభుత్వం
- నాలుగేళ్లుగా తగ్గిన దిగుబడులు
- ఆదుకుంటామన్న జగన్ హామీలు ఏమయ్యాయి..?



కాపులేని మామిడి తోట

కోలగట్లకు చెందిన రైతు రాధారెడ్డికి 25 ఎకరా ల మామిడి తోట ఉంది. మొక్కలు నాటి రెండేళ్లు దాటినా కాపురాలేదు. గతంలో క్యినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద రూ. 5 వేల వరకు రాయితీ ఇచ్చేవారు. ఆ డబ్బులతో మొక్కల కొమ్మలు కత్తిరించగా, కొత్త జంటలు వచ్చి కాపు కాసేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి నిధులు అందడం లేదని రాధారెడ్డి వాపోయారు.

తలుపూరుపాడుకు చెందిన రమణయ్యకు ఏడు ఎకరాల మామిడి తోట ఉంది. ప్రతిఏటా వాతావరణ పరిస్థితులు అనుకూలించక మామిడికాపు సక్ర మంగా లేక నష్టపోతున్నారు. పంట నష్టానికి ప్రభు త్వం పరిహారం కూడా చెల్లించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వీరిద్దరే కాదు... జిల్లాలోని మామిడి రైతులందరిదీ.

జగన్ ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేశాడు. తాను అధికారంలోకి రాగానే ఉద్ధరిస్తానని అన్ని రంగాల ప్రజలను మోసం చేశారు. అలాగే మామిడి రైతులను కూడా దగా చేశాడు. మామిడి రైతులకు ప్రోత్సా హమిస్తామని హామీ గుప్పించిన జగన్ సీఎం అయిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు.జిల్లాలో ఉద్యాన పంటల్లో భాగమయిన మామిడి తోటలు విస్తా రంగా ఉన్నాయి. అయితే రైతులు ప్రతి ఏటా తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. దిగుబడి ఉంటే ధర ఉండదు, ధర ఉంటే దిగుబడి లేక రైతులు నష్టపోతు న్నారు. ఇదిలా ఉంటే ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహం లేక వారు కుదే లవుతున్నారు.


**● రాయితీలు కరువు**

మామిడి తోటలకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి రాయితీలు కల్పించలేదు. గతంలో ఐదేళ్ల నుంచి పదేళ్ల లోపు మామిడి తోటలకు క్యినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద కొమ్మల కత్తిరింపు కోసం హెక్టార్‌కు రూ. 5వేలు ఇచ్చేవారు. ఎరువులు, మందులపై కూడా రాయితీ కల్పిం చేవారు. 20 ఏళ్లలోపు తోటలకు పునరుద్ధరణ పథకం కింద హెక్టార్‌కు రూ. 20 వేల రాయితీతో వివిధ రకాల పరికరాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాయితీల ఊసే లేదు. ఈ క్రమంలో జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడు తుంది.

**● ఐదు వేల హెక్టార్లలో సాగు**

జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లలో మామిడి సాగు అవు తుంది. సంగం, ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరు, ఉదయ గిరి, కలిగిరి, ఏఎస్‌పేట, జలదంకి, దగదర్తి, ఉలవపాడు తది తర మండలాలల్లో అధికంగా మామిడి సాగు చేస్తున్నారు. బంగి నపల్లి, అంటుమామిడి, నీలం, రసాలు వంటి రకాలు సాగవుతు న్నాయి. వీటిల్లో ప్రధానంగా బంగినపల్లి మామిడికి మంచి గిరాకీ, డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు జిల్లా నుంచి ఎగుమతి అవకాశం ఉంది. ప్రస్తుతం దిగుబడి సరిగా లేదు. ఉన్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. దిగుబడి బాగా వచ్చిన ఏడాది కాయలు కోత కోసిన వెంటనే నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరే జ్‌లు అందుబాటులో లేవు. మామిడి పంట అంతా ఒకేసారి కోయడం వల్ల మార్కెట్‌లో ధరలు తగ్గుతున్నాయి. దీంతో తాము మరింత నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో దిగు బడి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రాయితీలు అందజే యాలని రైతులు కోరుతు న్నారు.

- సంగం



చెట్లకు కాపు లేకపోవడంతో నరికేసిన కొమ్మలు



## పోలింగ్ రోజున సెలవు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మేనెల 13న అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఆదేశా లు జారీ చేశారని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న రోజువారీ సాధారణ, షిఫ్ట్‌లపై పనిచేసే కార్మికులంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ ఉత్తర్వు లు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఆ రోజున ఏ యజమాని కూడా వేతనం తగ్గించరాదన్నారు. ఎవరై నా ఈ ఉత్తర్వులను ఉల్లం ఘిస్తే కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.


- నెల్లూరు (సాంస్కృతికం)



## ప్రజాతత్వం మన ఓటు

పెద్దల మాట

● లియో టాల్ స్టాయి



ప్రభుత్వాల బలం ఎప్పుడూ ప్రజల అజ్ఞానంలో ఉంటుంది. ప్రభుత్వాలకు ఈ విషయం తెలుసు కాబట్టి ప్రజల్లో నిజమైన జ్ఞానాన్ని ఇవి వ్యతిరేకిస్తాయి. ఈ సత్యాన్ని మనం గుర్తించాల్సి ఉంది. ఒకవైపు ప్రజల్లో అజ్ఞానాన్ని వ్యాప్తి చేస్తూ, జ్ఞానాన్ని పెంపొందించేందుకు తీరిక లేనట్లుగా నటిస్తున్న ప్రభుత్వాన్ని అలాగే వదిలివేయడం అత్యంత హానికరం. వ్యతిరేక ఓటుతో ఇంటికి పంపండి.

- నెల్లూరు (సాంస్కృతికం)




## పరుగులు పెట్టించిన ప్రభాకరుడు

ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సం దర్భంగా ఆయన స్థానిక ఆనకట్ట సమీపం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రదర్శన నుంచి బయటకు పరుగులు తీశారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లతోపాటు ఒక్కొక్కరికి రూ.300ల చొప్పున నగదు, భోజనం ప్యాకెట్లు ఇచ్చినట్లు సమాచారం. అయినా కూడా జనం మధ్యలోనే పరుగులు తీశారు.

- ఉదయగిరి

## డిపాజిట్ దక్కడమంటే...?

ఈ ఎన్నికల్లో ఫలానా నాయ కుడికి డిపాజిట్ వస్తుందా.. అని అప్పుడ ప్పుడూ అడుగుతుంటాం. అసలీ డిపాజిట్ అంటే ఏమిటో తెలుసుకుందాం. ఎన్నికల్లో పోటీ చేసే వారు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కొంత నగదు డిపాజిట్‌గా చెల్లించాలి. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరికి చెందిన వారు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు చెల్లించాలి. పార్లమెంట్ స్థానాలకైతే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.12,500లు చెల్లించాలి. ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు 16.5 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి ఇస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు. దీన్ని డిపాజిట్ గల్లంతు అంటారు.

- ఉదయగిరి రూరల్




పోటీకి పార్టీ అభ్యర్థుల వెనుకడుగు

నోట మందు



## వీక్లీ ఆఫ్.. తుస్!

పోలీసుశాఖలో మూణ్నాళ్ల ముచ్చటగా వారాంతపు సెలవులు

పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి రాగానే వాటిని అలా అమలు చేసి.. ఇలా తీసేశాడు. సరిగ్గా నాలుగేళ్ల కిందట జూన్ 19న జిల్లాలోని పోలీసులకు వారంతపు సెలవులు అమలు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తొలిరోజు 45 మందికి మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖలోని సివిల్, ట్రాఫిక్, ఏఆర్ ఇలా పలు విభాగాల పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లలో వారాంతపు సెలవుల చార్టులను సిద్ధం చేశారు. ఈ చార్టులో ఆ స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఏ రోజు వారంతపు సెలవు తీసుకోవాలన్న సమాచారం పొందుపరిచారు. సెలవు లేని ఉద్యోగం ఏదైనా ఉందా ? అంటే అది పోలీసు ఉద్యోగమేరా ? అను కునే ఈ రోజుల్లో వారంలో ఒక రోజు సెలవు అమలు చేస్తారని తెలిసాక పోలీసు సిబ్బందితోపాటు వారి కుటుంబసభ్యులు ఎంతో ఆనందపడ్డారు. అయితే వారిలో ఈ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు. రోజులు గడిచే కొద్దీ సిబ్బంది కొరత ఉంది.. సెలవులు లేవంటూ అధికారులు వారంతపు సెలవులను పక్కన పెట్టేశారు. దీంతో ప్రభుత్వ తీరుపై పోలీసు సిబ్బంది ఆగ్రహిస్తున్నారు.

- నెల్లూరు (క్రైం)







## హామీపత్రం అడగండి !

యువతకు అడగండి

ఎన్నికల వేళ ఎర్రికూతలు కూసి, కుర్రకారు గుండెల్లో తిష్టవేసి, గిర్రుగిర్రున తిరుగుతూ ప్రచారాలు సాగిస్తే కుప్పి గంతులు వేసే యువకులారా... మీకు సంబరా లెందుకు? ఎన్నికల సభల్లో ఉన్నవి లేనివి ఆశ పెట్టి, నన్ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తా... ఉపాధి కల్పిస్తా.. ఉద్యోగాలు ఇస్తా.. ఇళ్లు కట్టిస్తా... అని వాగ్దానాల వరాలిచ్చే నాయకుల హామీలపై పంచిన కరపత్రాలపై చిత్రశుద్ధిగా అమలు చేస్తామని సంతకం చేసి హామీపత్రం ఇవ్వమని అడగండి. యువ ఓటర్లారా ఎవడొచ్చి, ఎన్ని వాగ్దానాలు చేసినా ఓటరుగా మీరు సరైన నిర్ణయం తీసుకోండి. విచక్షణతో ఓటు వేయండి.

- నెల్లూరు (సాంస్కృతికం)



అడుగంటిన కావలి పెద్ద చెరువు

నీటిమీద రాతల్లా సీఎం హామీలు

అటకెక్కిన వాగ్దానాలు

## నెరవేరని మాటలు..

# కావలి ప్రజల పాట్లు !

కావలి, ఏప్రిల్ 24: చుక్కల భూముల సమస్య పరిష్కార విషయమై గత ఏడాది మే12న కావలిలో జరిగిన సభ సాక్షిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నీటిబుడగల్లా మారాయి. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి కోరిక మేరకు కావలికి సీఎం జగన్ రూ.151 కోట్లతో వరాలు జల్లు కురిపించగా అవేమీ కూడా అమలుకు నోచలేదు.

**● కలగానే రిజర్వాయర్**

కావలి పెద్దచెరువును రిజర్వాయర్‌గా చేస్తే.. దాని దిగువున ఉన్న చెరువుల ద్వారా ఏడెనిమిది వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని చేసిన ప్రతిపాదనకు సీఎం రూ.35 కోట్లు మంజూరు చేశారు. 11 నెల లు గడిచినా నిధులు మంజూరు కాక, చెరువుల కింద పైర్లకు నీరందక ఎండిపోయాయి.

**● లింక్ కెనాల్ పనులు కూడా..**

సంగం బ్యారేజీ నుంచి చినక్రాక రిజర్వాయర్‌కు వెళ్లకుండా నేరుగా కావలి కాలువకు సాగునీరు వచ్చేందుకు అక్కడ లింక్ కెనాల్‌కు రూ.20 కోట్లు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. ఆ నిధులు మంజూరు చేసి ఉంటే ఆ కాలువ నుంచి జలదంకి, కావలి మండలాల చెరువులకు నేరుగా నీరు వచ్చి పంటలు పండేవి. ఆ అవకాశం లేకపోకడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



మౌలిక వసతులు లేక అర్ధంతరంగా ఆగిన ఇందిరమ్మ ఇళ్లు




**● సాగని ట్రంకురోడ్డు పనులు**

కావలి ట్రంకురోడ్డు పనులు నత్తనడకన నడుస్తుండ టంతో వాటిని ఎన్నికలలోపు పూర్తి చేసేందుకు మరో రూ.16 కోట్లు అవసరమని కోరగా, వాటిని మంజూరు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. ఎన్నికలు వచ్చినా అవి మంజూరు కాకపోగా ట్రంకు రోడ్డు విస్తరణ పనులు కూడా ఆగిపోయాయి.

**● మౌలిక వసతులు లేని కాలనీ**

గతంలో రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు నిర్మించిన ఇంది రమ్మ కాలనీల్లో మౌలిక వసతులు లేవు. దీంతో అనేక ఇళ్లు అర్ధంతరంగా ఆగిపోయి ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు కోరగా రూ.80 కోట్లు మంజూరు చేస్తు న్నట్లు సీఎం ప్రకటిం చారు. కాని ఇప్పటికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఆ ఇళ్లు అర్ధం తరంగా ఆగిపోయి నిరుపయోగంగా మారాయి.

**● హామీలన్నీ కాగితాలపైనే..**

సీఎం కావలి కి ఇచ్చిన రూ.151 కోట్ల హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు. ఇటీవల సిద్ధం సభకు కావలి వచ్చిన పుడు పట్టణ అభివృద్ధి గురించి మాట మాత్రం కూడా మాట్లాడక పోవటమే కాక గతంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిన ఈ సీఎంను చూసి ఓట్లు ఎలా వేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

## ఇంకెన్ని రోజులురా.. బాబూ ?

ఖర్చం.. ఎన్నికలు

ఈ సారి ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగ్‌తేదీ, ఫలితాల వెల్లడికి సుదీర్ఘమైన సమయం ఇచ్చింది కేంద్ర ఎన్నికల సంఘం. దీంతో బరిలో నిలచిన అభ్యర్థులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎన్నికలతేదీ ఎప్పుడు వస్తుందా ? అని వారు ఎదురు చూస్తున్నారు. ఓ వైపు మండుతున్న ఎండలు..మరో వైపు విస్తృత ప్రచారంలో పార్టీ కేడర్‌ను వెంటనడిచేలా చూసు కోవడం అభ్యర్థులకు సవాల్‌గా మారింది. వారికి రోజు వారీగా మర్యాదలు, ఇతర ఖర్చులు భరించలేక నానా తం టాలు పడు తున్నారు. చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కార్య కర్తలకు ఉద యం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయం త్రం స్నాక్స్, రాత్రికి డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు టీ, కాఫీలు, చల్లటీనీరు, శీతలపానీయాలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రచారం చేసేందుకు కొందరు కూలీలను ఏర్పాటు చేసుకోగా, వారికి మద్యం, రోజువారీ భత్యంతోపాటు చోటామోటా నాయకులకు ప్యాకేజీలు, వాహనాల ఖర్చులకు రోజుకు రూ. లక్షల్లో ఖర్చవుతున్నారు. ఇవన్నీ భరించలేక ఎన్నికలెప్పుడు ముగు స్తాయిరా.. బాబూ.. అంటూ అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు.

- అనంతసాగరం




## అప్పట్లో సేవ.. ఇప్పుడు సంపాదన

నా రోజుల్లో

మా రోజుల్లో ఎన్నికలకు, ఇప్పటి ఎన్నిక లకు ఎంతో తేడా ఉంది. అప్పట్లో పోటీ చేసే అభ్యర్థులు కనిపించేవారే కాదు. గ్రామ నాయకుడి వద్దకు మాత్రమే వచ్చి పోయే వారు. ఆయన వచ్చి ఫలానా అభ్యర్థికి, ఫలానా గుర్తుపై ఓటు వేయాలని చెప్పేవాడు. అది కూడా పోలింగ్‌కు ఒకటి, రెండు రోజుల ముందు... కానీ ఈ రోజుల్లో అభ్య ర్థులు, వారి కుటుంబ సభ్యులు ఇళ్లిళ్లు తిరుగుతున్నారు. ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. దీంతో ఏ నాయకుడు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియడంలేదు. నాడు ఎలాంటి ప్రలోభాలు ఉండేవికావు. అప్పటి నాయకులు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాలు చేసేవారు. నేడు సంపాదనే లక్ష్యంగా మారింది. ఎన్నికలనేవి డబ్బు, మద్యం మయమయ్యాయి. అందుకనే ప్రస్తుత రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి.



- సుబ్బరామానాయుడు (92), ఏఎస్ కండ్రిక, రైతు

## పెచారానికి ఎలితే తాగినంత మందట!

ఎట్టెట్టా

**యంకటయ్య:** రేయ్ శీనా... ఎలచన్ల పెచారానికి ఎలితే తాగినోడికి తాగినంత మందంట కదరా...?
**శీనయ్య :** అవునంటా మావా... మొన్న మా చిన్నా యాన పోయి ఫుల్‌గా తాగేసి వచ్చాడు. మా చిన్న మ్మ తెగ తిడతావుంది.
**యంకటయ్య:** అవునేగాని రే... ఏ మందు పోస్తు న్నారు.. వాళ్లు ?
**శీనయ్య :** మావా.. అల్లా పార్టీవోళ్లేమో చీప్‌లిక్క రంట. ఈలోళ్లు మాత్రం ఒకరకమైంది ఇస్తున్నారంట.
**యంకటయ్య:** మరి డబ్బులు ఈయట్లేదా శీనా ?
**శీనయ్య :** దానిలెక్క దాందే మావో... దీని లెక్క దీందే...! డబ్బులు ఈయకపోతే మనోళ్లు ఊరుకుంటారా...?
**యంకటయ్య:** మగోళ్లకి మందుపోయిస్తే.. మరి ఆడోళ్లరా...?
**శీనయ్య :** మావో వాళ్లా ఇప్పుడు ముదిరిపోయారే.. మందు బదులు డబ్బులు, లేదా మందే ఈయమంటున్నారంటా. ? అదీ మందల.




- నెల్లూరురూరల్

# సర్వేపల్లి ప్రజల ఆశీస్సులతో విజయం ఖాయం

**● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి**

**వెంకటాచలం, ఏప్రిల్ 24:** సర్వేపల్లి ప్రజల ఆశీస్సులతో 1994, 1999 ఎన్నికలకు మించిన మెజార్టీతో తాను మే 13న జరిగే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమైపోయిందని సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా సోమిరెడ్డి నామినేషన్ వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి నుండి బయలుదేరిన ఆయన తొలుత అల్లీపురం గ్రామదేవత శ్రీ చెరుకూరమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గొలగమూడికి చెరుకుని వెంకయ్యస్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11.18 నిమిషాలకు వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసుకి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కూటమి తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ముస్లీం మైనార్టీ నేత షేక్ అమీర్ బాషా, బీసీ నేత మల్లికార్జున్ యాదవ్ ఉన్నారు.



వెంకటాచలం: మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

### కాకాణి మద్యం తాగి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు

ఐదేళ్ల వైసీపీ పాలనలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డంగా దోచుకున్న డబ్బును ఎన్నికల్లో వెదజల్లినా ఓటమి నుంచి తప్పించు కోలేడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటా చలంలో బుధవారం నామినేషన్ దాఖలు అనంతరం కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో కాకాణి పంచనున్న మద్యం దయచేసి ఎవరూ తాగొద్దని, తాగి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సూచించారు. అనంతరం కూటమి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని, రాష్ట్రంలో రాక్షస, పాలన పోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఆదరించి ప్రజాస్వామ్యాన్ని బతికించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

### కాకాణికి గుణపాఠం తప్పదు

**తోటపల్లిగూడూరు:** సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి దుర్మార్గాలకు గుణపాఠం తప్పదని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ మహాలక్ష్మీపురం, ముత్యాల పట్టపుపాలెం, ముక్కంటమ్మ కాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే శ్మశానంకు దారి, కోడూరు బీచ్ రోడ్డుకు మహర్దశ తీసుకొస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, వీరబోయిన గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

### అనికేపల్లిలో టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

మండలంలోని అనికేపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు, అనికేపల్లిలో సోమిరెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. తొలుత వినాయక స్వామి ఆలయంలో సోమిరెడ్డి గెలుపు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, చెముడుగుంట శ్రీనివాసులు, చెమికల క్రిష్టయ్య, రాజన్న సైన్యం సభ్యులు, యువత తదితరులున్నారు.

## ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం

**బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 24:** మండలంలోని పెనుబల్లిలో బుధవారం నూతన రామాలయం ప్రారంభోత్సవంతో పాటు ఆలయంలో సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ముందుగా ధ్వజ స్తంభాలు, గర్భగుడి గోపుర శిఖరాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రామాలయంలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభాలు

## సర్వేపల్లిలో మూడు నామినేషన్లు

**వెంకటాచలం, ఏప్రిల్ 24:** సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం టీడీపీ తరపున సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం సోమిరెడ్డి ఆర్‌వో కార్యాలయానికి చేరుకుని రెండు నామినేషన్ సెట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నఓబులేసుకి అందజేశారు. అదేవిధంగా ఆయన కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఆమె వెంట సోమిరెడ్డి కుమార్తై సింధురెడ్డి, మహిళా నాయకురాలు వెంపులూరు అరుణ, న్యాయవాది హరినారాయణ ఉన్నారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా గొల్లమూరి రవి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో బుధవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి.

### రహదారి భద్రతపై అవగాహన తప్పనిసరి

**ముత్తుకూరు, ఏప్రిల్ 24:** రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు తెలిపారు. బుధవారం కృష్ణపట్నం పోర్టు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వాలంటీర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారు ప్రయాణికులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, భాస్కరన్, రాజేష్ రంజన్, మృత్యుంజయరామ్, తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ పరీక్షలలో ఒకరి డీబార్

**వెంకటాచలం, ఏప్రిల్ 24:** విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బుధవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 790 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 365 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. నెల్లూరులోని శ్రీచంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

### ఉచిత న్యాయ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి

**వెంకటాచలం, ఏప్రిల్ 24:** ఉచిత న్యాయసేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంటలో జిల్లా కేంద్ర కారాగారంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు, దీని ద్వారా పేదలు న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చన్నారు. ఖైదీలు ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తరువాత కుటుంబ సభ్యులతో సంతోషంగా మెలగాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో జైలర్ జీవీ రమణయ్య తదితరులున్నారు.

### పుస్తక ప్రదర్శన

**బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 24:** స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా వేణుగోపాల స్వామి, సీతారాముల కల్యాణోత్సవాలు

**నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 24:** నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకుడు శ్రీనివాస అయ్యంగార్ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఉభయ దాతలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి వ్యవహరిం చారు. అనంతరం గజవాహనంపై నగరోత్సవం జరిగింది.

**● రాములవారి రథోత్సవం**

బాలాజీనగర్‌లోని వీధులన్నీ జైశ్రీరామ్... అనే నామస్మరణతో మారుమోగాయి. సీతారామ మందిరంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. ఉభయదాతలు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సంధ్య దంపతులు రథాన్ని లాగారు.



రథం లాగుతున్న కోటంరెడ్డి దంపతులు

● శబరి శ్రీరామక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం హోమం, బలిహరణ, ఉత్సవమూర్తులకు అభిషేకం, తిరుమంజన సేవలు జరిగాయి. సాయంత్రం బ్యాండు కచేరీ, రాత్రి సీతారాముల కల్యాణం జరిగాయి.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం జరిగింది. ఉదయం విశేష పూజలు, సాయంత్రం ప్రత్యేక పుష్పాలంకారం జరిగాయి. గురువారం ఉదయం 9గంటలకు రథోత్సవం జరుగుతుంది.

## వెంకటగిరికి తరలిన టీడీపీ శ్రేణులు



వెంకటగిరికి వెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

**సైదాపురం, ఏప్రిల్ 24:** వెంకటగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ నామినేషన్ కార్యక్రమానికి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణకు సైదాపురం మండలం నుంచి అధిక మెజార్టీ తెప్పించాలన్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రమణ్యంరాజు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ వరదబండి వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.

### వీఎస్‌యూ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్‌కు ఎక్సలెన్స్ అవార్డు

**వెంకటాచలం, ఏప్రిల్ 24:** వీఎస్‌యూలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్బారం జ్యోత్స్న భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. దీంతో బుధవారం ఆమెను వీఎస్‌యూ వీసీ సుందరవల్లి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, సీడీసీ డీన్ విజయ తదితరులున్నారు.

### దామరమడుగులో చోరీ

**బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 24:** మండలంలోని దామరమడుగు గ్రామంలో జక్రియా ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. జక్రియాతోపాటు కుటుంబ సభ్యులు ఈనెల 22న చీరాలకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి వుండడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. బీరువాలోని 12 సవర్ల బంగారం, 50వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ హైమారావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించినట్టు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీం ఇంట్లో వేలిముద్రలు సేకరించారు.

## కారు, మోటారు బైక్ ఢీ : ఒకరికి గాయాలు

**సంగం, ఏప్రిల్ 24:** తరుణవాయి క్రాస్ రోడ్డు దాటిన తరువాత ముంబాయి రహదారిపై ఎదురెదురుగా వస్తున్న కారు, మోటారు బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటారు బైక్ నుజ్జునుజ్జు అయ్యింది. నడుపుతున్న యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వాహనాలను ఓవర్ ట్రాక్ చేసే క్రమంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కారు బెలూన్ ఓపెన్ కావడంతో కారులో ఉన్నవారికి ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రున్ని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. బాధితుడి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



కారును ఢీకొన్న మోటారు బైక్

## సంగంలో రూ.1.67లక్షల స్వాధీనం

**సంగం, ఏప్రిల్ 24:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మద్యం, నగదు అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్థానిక పోలీస్ చెక్‌పోస్టులో బుధవారం రూ.1.67 లక్షలు పట్టుకున్నారు. వాహనతనిఖీల్లో భాగంగా ముంబాయి రహదారిపై వెళ్తున్న కారు ను తనిఖీ చేయగా ఓ కారుల్లో ప్రభంజన్‌కుమార్ అనే వ్యక్తి రూ.1.67 లక్షలు నగదును ఆత్మకూరు వైపు తీసుకెళ్త న్నారు. అందుకు సం బంధించిన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.



పట్టుబడిన నగదుతో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది

## దర్గాలో హఫీజ్ పాషా దౌర్జన్యం

- గాలేఫాలు,ప్రసాదాలు ఎత్తుకేళ్లే ప్రయత్నం
- అడ్డుకున్న వక్ఫ్ బోర్డు అధికారులు

**ఏఎస్ పేట, ఏప్రిల్ 24:** స్థానిక ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో మంగళవారం రాత్రి దర్గా సజ్జాద హఫీజ్ పాషా గాలేఫలు, ప్రసాదాలు తనకు చెందినవని వాటిని తను తీసుకెళ్తానని తన అనుచరులతో దర్గాలోకి ప్రవేశించారు. దీనితో వారిని దర్గా ఈవో హసేన్, అసిస్టెంట్ ఈవో షరీఫ్ అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరుకులు తీసుకెళ్లడానికి తనకు కోర్టు ఆర్డర్ ఉందని పోలీసులను సైతం తనకు మద్దతుగా తీసుకొచ్చారు. కోర్టు ఆర్డర్ ప్రకారం దర్గా సజ్జాదగా ప్రార్థనలు మాత్రమే చేసుకోవాలని దర్గాలోని ఏ వస్తువులు తీసుకెళ్లడానికి మీకు హక్కు లేదని ఈవో తెలపడంతో ఇరువురికి కొంత సమయం వాగ్వాదం జరిగింది. గతంలో ఇదేవిధంగా దౌర్జన్యం చేయడంతో ఈవో ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. సజ్జాదగా హఫీజ్ పాషా మాత్రమే దర్గాలో ప్రార్థనలు చేయాలి కాని అతను కాకుండా అతను తరుపున వేరే వ్యక్తులు ప్రార్థనలు చేస్తున్నారు. దీని గురించి వక్ఫ్ బోర్డు అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. వక్ఫ్‌బోర్డు అధికారుల అండతోనే నియమాళికి విరుద్ధంగా వేరే వ్యక్తులు విధులు నిర్వహిస్తున్నారని, వారికి వాటాలలో తేడా వచ్చినప్పుడు మాత్రమే ఇలా గొడవలు పడుతుంటారని వక్ఫ్ బోర్డు అధికారుల పనితీరుపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



వక్ఫ్ బోర్డు అధికారులతో వాదిస్తున్న హఫీజ్ పాషా

### మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై కేసు నమోదు

**మర్రిపాడు, ఏప్రిల్ 24:** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘింగించినందుకు వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి తండ్రి మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డిపై మర్రిపాడు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఇటీవల అల్లంపాడులో ఆయన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మను పదే పదే కులం పేరుతో ప్రస్తావిస్తూ ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. "నెత్తిన రూపాయి పెడితే ఐదు పైసలకు చెల్లదు" అంటూ ఆంధ్రజ్యోతిలో 20వ తేదీ వచ్చిన శీర్షికపై స్థానిక ఎంపీడీవో మనోహర్‌రాజు స్పందించారు. ఆయన విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి సోమవారం కేసు నమోదు చేశారు. అయితే కులం పేరుతో దూషించారని నాలుగురోజుల క్రితం రాజమోహన్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వెంకటరమణమ్మ ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా పోలీసులు పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయి.

## నగదు, మద్యం స్వాధీనం

**నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు చేపట్టిన తనిఖీల్లో రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.11.59 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.2 లక్షలు, సంతపేట పరిధిలో రూ.92 వేలు, కోవూరు పరిధిలో రూ2 లక్షలు, కావలి 1 టౌన్ పరిధిలో రూ.5 లక్షలు, సంగం పరిధిలో రూ.1.67 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దగదర్తి పరిధిలో 42 క్వార్టర్ల మద్యం, సైదాపురంలో 10, చిట్టగుంటలో 35, కేపీ పోర్టులో 21, జలదంకిలో 8, కలిగిరిలో 11, సెబ్ అధికారులు 182 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. 1900 లీటర్ల బెల్లపు ఊటను కూడా స్వాధీనం చేసుకున్నారు.

## పాత కక్షలతోనే యువకుడి హత్య?

**నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24:** నెల్లూరులోని ఆటోనగర్‌లో మంగళవారం జరిగిన యువకుడి హత్య కేసులో వేదాయపాళెం పోలీసులు ఓ నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 23వ తేదీ తెల్లవారు జామున దశరథ అనే యువకుడు ఆటోనగర్‌లోని ఖాళీస్థలాల్లో దారుణ హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. దశరథ తల్లి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ వీవీ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శరీరంపై కత్తితో పలుచోట్ల నరికి, గుండెల్లో కత్తిని దించాల్సిన అవసరం ఎవరికి ఉందన్న కోణంలో విచారణ చేపట్టారు. మృత దేహం లభ్యమైన పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను, దశరథ ఫోన్ కాల్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పాతకక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

## సంచార జాతులను గుర్తించండి

**నెల్లూరు (వీఆర్సీ):** రాష్ట్రంలోని సంచార జాతులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎంబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ శంకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంబీసీ లుగా పిలువబ డే సంచార జా తులను గుర్తిం చి తమ అభివృ ద్ధికి కృషి చే యాలని, అండ గా నిలవాలని కోరారు.

## సౌత్‌మోపూరులో గడ్డివాము దగ్ధం

**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24 :** నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో బుధవారం ప్రమాదవశాత్తు 15 ఎకరాల వరి గడ్డి వాము దగ్ధమైంది. కారణాలు తెలియదు కానీ, సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసింది. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు దరి సి సుబ్రహ్మణ్యం తెలిపారు.

### గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు (వీఆర్సీ):** నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని చిట్టేడు (బాలురు), శ్రీకాళహస్తి (బాలికల)లోగల గిరిజన గురుకుల కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు గిరిజన (యానాదులు) విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్టు అధికారి డాక్టర్ రాణీ మంద ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మే 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ఎస్సీ, బీసీ, ఓసీలకు ఒక్కొక్క సీటు మాత్రమే కేటాయిస్తామని తెలిపారు. సందేహాలనివృత్తికి 94410 33367 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 133 |
| లేయర్ లైవ్ | 93 |
| స్కిన్ చికెన్ | 236 |
| స్కిన్‌లెస్ | 264 |
| లేయర్ | 158 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 6827 |
| వెండి కిలో ధర | రూ. 83,100 |
| వెండి ఒక గ్రాము | రూ. 85.10 |

# కోవూరులో రైతుల కష్టాలు తీరుస్తాం

**● గంగవరం ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి**

**కోవూరు, ఏప్రిల్ 24:** నియోజకవర్గ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాల్ని తీరుస్తామని ఎన్డీఏ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గంగవరం, పడుగుపాడుల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. వైసీపీ రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు చితికిపోయారన్నారు. స్థానిక రైతులు పెన్నానది పొర్లుకట్టలు తెగి తీవ్రంగా నష్టపోయారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పంట కాలువల మరమ్మతులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎన్నో సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో తాను చేసి చూపిస్తానన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్ను కుంటే సూపర్‌సిక్స్ పథకాలను అమలుపరచుకోవచ్చన్నారు. పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. ప్రచార కార్యక్రమంలో పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, గంగవరపు రవిచంద్ర నాయుడు, పఠాన్ నజీర్‌బాషా, గూటూరు శ్రీధర్‌నాయుడు, లక్ష్మీనరసారెడ్డి, అజిగంటి రమణయ్య, బుధవరపు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : గంగవరంలో రైతుల సమస్యలు తెలుసుకొంటున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

### అభివృద్ధే మా లక్ష్యం : నీలిమారెడ్డి

**ఇందుకూరు పేట :** అభివృద్ధే మా లక్ష్యమని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి కుమార్తై నీలిమారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో బుధవారం ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద ఎంతమంది బిడ్డలు ఉన్నా ఒక్కో బిడ్డకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని, ప్రతి ఇంటికి కుళాయి ఇచ్చి స్వచ్ఛమైన నీరు అందిస్తామని, బీసీ రక్షణ చట్టం తీసుకువస్తామని పూర్ టు రిచ్ ద్వారా ప్రతి పేద వాడిని సంపన్నులని చేస్తామని తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కైలాసం ఆదిశేషారెడ్డి, మునగాల రంగారావు, నెల్లూరు రవీందర్‌రెడ్డి, కుమార్, రామచంద్రయ్య, బీజేపీ నాయకులు, కైలాసం లావణ్య శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

### వేమిరెడ్డి దంపతులను గెలిపించాలి

**విడవలూరు:** నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డిలను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ వావిళ్ల, ముదివర్తి గ్రామాల్లో ప్రశాంతిరెడ్డి అల్లుడు శ్రీనివాసులరెడ్డి, మండల కోఆప్షన్ మెంబరు ఎస్‌కె రఫీలు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకి తిరుగుతూ టీడీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు పరచనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏటూరు హరిరెడ్డి, డాన్ శివ, శరత్, మిండా సరితా, డాన్ శీను పాల్గొన్నారు.

### వేమిరెడ్డి దంపతులను విమర్శిస్తే సహించం

**బుచ్చిరెడ్డిపాళెం:** సేవాభావం కలిగిన వేమిరెడ్డి దంపతుల ను విమర్శిస్తే సహించేది లేదని స్థాని క టీడీపీ మహిళా నేతలు కౌన్సిలర్ అందె ప్రత్యూష, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పు ట్టా ధనలక్ష్మి, మాజీ ఎంపీటీసీ పెన్నతూరు సుమలత అన్నారు. బుధవారం వారు బుచ్చి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి శ్రీరెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికలు జరగకముందే ప్రశాంతిరెడ్డి గెలుపును తట్టుకోలేక ఇలా దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదని హితవుపలికారు. ఈ సమావేశంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఇందుకూరు పేట : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నీలిమారెడ్డి



విడవలూరు: ముదివర్తి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు రఫీ తదితరులు

# ఎన్నికల పర్వం

## సిటీ నుంచి నారాయణ కుమార్తె నామినేషన్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 24 : నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ కుమార్తె సింధూర ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి బుధవారం నామినేషన్ వేశారు. సిటీ ఆర్వో వికాస్ మర్మత్‌కు నామినేషన్ పత్రాలు అందచేశారు. ఆమెతోపాటు ఆమె తల్లి రమాదేవి కూడా నామినేషన్ పత్రాలను కార్పొరేషన్ కార్యాలయంలో అందించారు. రమాదేవి ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసి ఉన్నారు. కాగా, నారాయణ తరపున ఆ పార్టీ నాయకులు మరో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. వైసీపీ సిటీ అభ్యర్థి ఖలీల్ తరపున ఆ పార్టీ నాయకులు నామినేషన్ పత్రాలు అందించారు. మహ్మద్ నసీమ పేరిట మరో సెట్ నామినేషన్లను వైసీపీ నాయకులు ఆర్వోకు అందచేశారు. బీఎస్పీ నుంచి చల్లా శరత్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా పెరుందూరు ఇరిగేంద్రబాబు, బుక్కరాజు శ్రీనివాస రాజు నామినేషన్లను ఆర్వోకు అందించారు.

## నెల్లూరు రూరల్‌కి మూడు నామినేషన్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్ వేశారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో మలోలకు నామినేషన్ పత్రాలను అందించారు. టీడీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి షేక్ ముజీబ్ ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసి ఉన్నారు. బుధవారం అదనపు సెట్లు అందజేశారు. తాజాగా ఇండిపెండెంట్ అభ్యర్థి జడా నిరంజన్ నామినేషన్ వేశారు. కాగా, ఇప్పటివరకు 10 మంది 15 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించండి : కలెక్టర్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో సజావుగా జరిగేందుకు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం కమాండ్ కంట్రోల్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషను వేసినప్పటి నుంచి ఖర్చులు నమోదవుతాయన్నారు. క్రిమినల్ కేసులు ఉన్నట్లైతే ఆ వివరాలను అభ్యర్థులు మూడు పర్యాయాలు పేపర్లు, టీవీ చానళ్లలో ప్రకటనల రూపేణ ఇవ్వాలన్నారు. ఇదంతా సొంత ఖర్చుల కింద లెక్కిస్తామన్నారు. 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణలుంటాయని అదే రోజు మధ్యాహ్నం అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సాధారణ పరిశీలకుడి గా నియమితులైన రామ్‌కుమార్ గౌతమ్ నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ స్వాగతం పలికారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఎస్పీ పరిశీలన

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీకేడబ్ల్యూ కళాశాల, రంగనాయకుల పేటలోని పీఎంఆర్ హైస్కూల్, కోటమిట్ట, వెంకటేశ్వరపురం, రామూర్తినగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రా లను పరిశీలించారు. ప్రశాంత వాతావర ణంలో ఎన్నికల నిర్వహణ కోసం సమస్యా త్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించామని, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు చేశామని చెప్పారు. పోలింగ్ రోజున ఓటింగ్ కేంద్రాల కు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్ప ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఎన్ని కల నియమావళిని అతిక్రమించినట్లు తెలి స్తే సీ-విజిల్ యాప్ ద్వారాగానీ, 112 నెంబ రుకుగానీ, దగ్గర్లోని పోలీసు స్టేషన్‌లోగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## సీఐడీ అదుపులో టీడీపీ సానుభూతిపరుడు

● పార్టీ మారనందుకు కక్షకట్టారు? ● పాత కేసులో విచారణకు తీసుకువచ్చాం : సీఐడీ



సీఐడీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24: నగరంలోని రామలింగాపురానికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు, వ్యాపారవేత్త లీలామోహన్‌రెడ్డిని బుధవారం సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ నాయకుడు ఏసు నాయుడు కుమార్తె వివాహ కార్యక్రమానికి బుధవారం ఉదయం లీలామోహన్‌రెడ్డి హాజరయ్యారు. అప్పటికే అక్కడ కాపు కాచిన సీఐడీ పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులు పోలీసులను అడ్డగించగా ఓ కేసు విష యంలో తీసుకు వెళుతున్నామని, విచారించి పంపుతామని చెప్పారు. అయితే సాయంత్రం వరకు లీలామోహన్‌రెడ్డి ఇం టికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సీఐడీ కార్యాల యానికి వెళుతున్నారన్న ప్రచారం జరగడంతో దర్గామిట్ట పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సీఐడీ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అయితే టీడీపీ రూరల్ నాయ కులు, జనసేన నాయకులు సీఐడీ కార్యాలయం వద్దకు చేరుకుని లీలామోహన్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకుడు మదన్ కు మార్ రెడ్డి మాట్లాడుతూ లీలామోహన్‌రెడ్డిని వైసీపీలో చేరా లని విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొద్ది రోజులుగా ఒత్తిడి చేస్తున్నారని, అతను టీడీపీలోనే కొనసాగుతానని చెప్పడంతో సీఐడీ అధికారులతో అక్రమంగా అరెస్ట్ చేయిం చారని ఆరోపించారు. ఇలాంటి ఎన్ని కేసులు పెట్టినా రూర ల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భారీ విజయం కోసం కృషి చేస్తూ నే ఉంటామని చెప్పారు. కాగా, గతంలో నమోదైన ఓ క్రికెట్ బెట్టింగ్ కేసు విచారణ కోసం లీలామోహన్‌రెడ్డిని తీసుకు వచ్చామని సీఐడీ అధికారులు చెబుతున్నారు.

# నెల్లూరు సిటీ

# నెల్లూరు రూరల్


వర్షాలు, వరదలొస్తే పొట్టేపాళెం వద్ద కలుజు వద్ద రోడ్డు పరిస్థితి ఇది (ఫైల్)

మోసం గురూ!

వదిలెయ్.. వదిలెయ్ అంటూ

# వదిలేశాడు?

● మాట తప్పి, మడమ తిప్పిన జగన్ ● పొట్టేపాళెం వద్ద నిత్యం ప్రమాదాలు
● వర్షాలొస్తే ములుముడి కలుజుతో డేంజర్ ● గుంతలమయంగా తాటిపర్తి రహదారి
● మూడేళ్లక్రితం సీఎం ఇచ్చిన హామీలేమయ్యాయి? ● ప్రశ్నిస్తున్న పల్లె ప్రజలు

'వదిలెయ్.... వదిలెయ్.... నాకు వదిలెయ్ అన్నా!.. ఆ పని పూర్తిచేసే బాధ్యతనాది!.... మీ ఇబ్బందులను తీర్చేందుకు మీ బిడ్డ జగన్ ఎప్పుడూ ముందుంటాడు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ చరిత్రలో లేదు!'... ఇలా బహిరంగ సభల్లో ఆర్భాటంగా ప్రసంగించే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 2021లో నెల్లూరును వరదలు ముంచెత్తిన సమయంలోనూ అక్షరం పొల్లుపోకుండా ఇదేవిధంగా హామీలిచ్చారు. నెల్లూరు రూరల్ ప్రాంతం పొట్టేపాళెం, జొన్నవాడ రేవు వద్దకు వచ్చి కలుజులు నిర్మిస్తానని, నెల్లూరు - తాటిపర్తి రహదారిని బాగుచేస్తానని ప్రకటించారు. మూడేళ్లు గడిచినా ఇప్పటికీ అక్కడ రాయిపడలేదు. దీంతో సీఎం హామీల విలువ ఇంతేనా? అంటూ పల్లె ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు రూరల్


దెబ్బతిన్న దేవరపాళెం రహదారిని పరిశీలిస్తున్న సీఎం జగన్ (ఫైల్), నేటికీ పూర్తిగా మెరుగుపడని రహదారి


పక్కనే నిర్మించిన తాత్కాలిక రోడ్డు కూడా దెబ్బ తినడంతో ప్రయాణానికి ప్రజలు అవస్థపడ్డారు.

● మండలంలోని ములుముడి కలుజు వద్ద కూడా ఇదే

నెల్లూరు నుంచి జొన్నవాడ వెళ్లే మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. పరిసర గ్రామాల జనం ఈ రోడ్డు మీదుగానే నెల్లూరు నగరానికి వచ్చి వెళుతుంటారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన జొన్నవాడ, నరసింహకొండకు వెళ్లేందుకూ ఇదే ప్రధాన రహదారి. అలాంటి రోడ్డుపై పొట్టేపాళెం వద్ద కలుజు ప్రమాదకరంగా తయారైంది. ఈ కలు జు నుంచి రోడ్డుపైకి చెరువు నీళ్లు ఎప్పు డూ పారుతూనే ఉంటాయి. నీటి ఉధృ తికి, ఆ నీటితో ఏర్పడ్డ పాచి వల్ల ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వర్షాకాలమైతే ఈ మార్గంలో ప్రయాణాన్ని పోలీసులు నిషేధిస్తున్నారంటే ప్రమాద తీవ్రత ఏ స్థాయిదో అర్థ మవుతుంది. ప్రత్యామ్నాయంగా దుస్థితి. కనుపూరు కాలువ వృథా నీళ్లు ఇక్కడ చెరువులోకి వచ్చి కలుజు ద్వారా పెన్నా నదిలోకి వెళ్తాయి. ఆ సమయంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. జొన్నవాడ - తాటిపర్తి రహదారి అయితే గజానికొక గుంతతో అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు మీద ప్రయాణం నరకప్రాయంగా మారింది. జొన్నవాడ మలుపు వద్ద దేవరపాళెం వైపు ఫర్లాంగు దూరం రోడ్డు కొట్టుకుపో యింది. అప్పట్లో హడావిడిగా అతుకు వేశారేగానీ ఆ తర్వాత పరిస్థితి మామూలే!.

### నేనున్నానంటూ హామీ

ఈ కలుజులు, రహదారులను 2021 డిసెంబరు నెలలో ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక శాసన సభ్యుడిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారుల బృందంతో కలిసి వాస్తవ పరిస్థితులను సీఎంకు వివరించారు. ప్రజలు కూడా వారి ఇబ్బందులను ఏకరువు పెట్టారు. 'ఆందోళన వద్దన్నా... నేనున్నాను... అంతా సరిచేస్తా...! మీకు ఏ ఇబ్బందిలేకుండా చేస్తా..' అంటూ జగన్ హామి ఇచ్చారు. ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు కాబట్టి ఈ ప్రాంతానికి మహర్దశ పడుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఏళ్లు గడిచినా హామీలు మాత్రం కార్యరూపం దాల్చకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్న గ్రామీణ ప్రజలు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో సరికొత్త శకం... ఎన్డీయేకు అఖండ మెజార్టీ

● టీడీపీ రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి


రోడ్ షోలో మాట్లాడుతున్న రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24 : రాష్ట్రంలో మే 13వ తేదీ ఎన్నికల పోలింగ్ తర్వాత సరికొత్త శకం ఆవిష్కృతమవుతుందని, అఖండ మెజార్టీతో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం 38వ డివిజన్ ఎర్రకట్టలో ఎన్నికల ప్రచార రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష చంద్రబాబు సీఎం కావడమేనన్నారు. పేద, నిరుపేద, మధ్యతరగతి ప్రజలందరిని పరిగణలోకి తీసుకుని ఎన్డీయే కూటమి ఎన్నికల హామీలను రూపొందించిందని చెప్పారు.

### టీడీపీలో చేరికలు

రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీ పదవులకు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఇటీవల వైసీపీ అభ్యర్థి ఆదాల సమక్షంలో కండువా కప్పుకున్న 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చెందులూరు సుభాషిణి కుమారు డు గంగాధర్ యాదవ్ టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. దేవరపాళెం గ్రా మానికి చెందిన వేమిరెడ్డి నారాయణరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి కోటంరెడ్డి సోదరుల సమక్షంలో టీడీపీలో చేశారు. 29వ డివిజన్ నుంచి హుమయూన్, షఫీ, 30వ డివిజన్‌కు చెందిన తాతినేని కృష్ణవేణి మిత్రబృందం, ఆమంచర్ల గ్రామానికి చెందిన కొంగర శ్రీనివాసులు నాయుడు, పుల్లయ్యనాయుడు, దాసరి వేణు నాయుడు తదితరులు, సౌత్‌మోపూరుకు చెందిన బొనిగల హర్ష, ఉంటా శివరాం, ఆరె ద్దుల సుధీర్ మిత్రబృందాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి పలు ప్రాంతాల్లో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు.

## వీపీఆర్, నారాయణతోనే స్మార్ట్‌సిటీ : కేతంరెడ్డి



నెల్లూరు (విద్య) : నెల్లూరును స్మార్ట్‌సి టీగా మార్చడం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణకే సాధ్యమని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. నగరంలోని 52వ డివిజన్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధే లక్ష్యంగా, సేవాభావం కలిగి, సొంత నిధులైనా వెచ్చించే మనస్తత్వం కలిగిన వారిద్దరూ గెలిస్తేనే నెల్లూరుకు భవిష్యత్ ఉంటుం దన్నారు. ప్రజలంతా వారిని ఆశీర్వ దించి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## రియల్టర్ స్వార్థానికి కూలిన తాటిచెట్లు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24 : నెల్లూరు - మైపాడు రహదారిపై కొత్తకాలువ వద్ద నూతనంగా నిర్మిస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం దాని యజమాని స్వార్థానికి ఇరిగేషన్ కాలువ కట్టపై ఉన్న 300 తాటి చెట్లు నేలమట్టమయ్యాయని అల్లీపురానికి గౌడ్ కులస్తులు బుధవారం కలెక్టర్ ఎం హరినాయాణన్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. కల్లుగీత జరుగుతున్న ఈ సమయంలో తాటిచెట్లను ఎక్స్‌కవేటర్‌తో కూల్చేస్తున్నారని, రియల్ వెంచర్‌కు ఈ చెట్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. జాఫర్ సాహెబ్ కాలువ కరకట్టపై ఉన్న చెట్లను రియల్ వ్యాపారులు ఎలా కూల్చేస్తారని ప్రశ్నించారు. అధికారులు తక్షణం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 1 నుంచి క్రికెట్ వేసవి శిబిరం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 24 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30వతేదీ వరకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం క్రికెట్ క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టేడియంలోని క్రికెట్ సంఘం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్‌లో మెలకువలు నేర్పిస్తామని తెలిపారు.

## పీజీ ఫలితాల్లో 'కృష్ణచైతన్య' ప్రతిభ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 24 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎంబీఏ, ఎంసీఏ ద్వితీయ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, రాణా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. డీన్స్ మల్లికార్జునయ్య, జ్యోతి, ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

## టెన్త్‌లో 'ఎస్‌వీఆర్' విద్యార్థుల ప్రతిభ




నెల్లూరు (విద్య), ఏప్రిల్ 24 : నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో గల ఎస్‌వీఆర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఏ విజిత 590, యూవీ సంతోష్ 589, ఎస్‌కే హలీమా 585 మార్కులు సాధించారన్నారు. 17 మంది 550 మార్కులకుపైగా, ఆరుగురు 500కుపైగా మార్కులు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, డైరెక్టర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ ప్రభుత్వంలోనే ప్రశాంత జీవనం

### మాజీ మంత్రి, నగర అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 24 : రాష్ట్రం బాగుపడాలన్నా, ప్రజలంతా ప్రశాంత జీవనం గడపాలన్నా ఒక్క తెలుగుదేశం ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నగరంలోని 6వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కూడా రాష్ట్రం అంతా అరాచకమేనని, అభివృద్ధి అన్న మాటే లేదని విమర్శించారు. రాష్ట్ర బాగుపడాలంటే లా అండ్ ఆర్డర్‌ను సక్రమంగా అమలు చేయాలన్నారు. వ్యాపారులు, సంస్థలు ప్రశాంతంగా వారి పనులు చేసుకునేలా, ప్రజలు సుఖమైన జీవనం గడిపేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇవన్నీ గత టీడీపీ ప్రభుత్వంలో జరిగేవని, వైసీపీ వచ్చాక అరాచకం ఒక్కటే కనిపించిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఈ సమస్యల న్నీ పరిష్కారం అవుతాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలే చెపు తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు.



రథోత్సవంలో నాయకులతో నారాయణ

● 53, 54 డివిజన్లలో జరిగిన ఎన్నికల ప్రచారంలో నారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

● 13, 52 డివిజన్లలో నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి నారాయణ, వీపీఆర్‌ను గెలిపించాలని కోరారు. 9, 11 డివిజన్లలో నారాయణ కుమార్తె పొంగూరు శరణి, 45వ డివిజన్‌లో మరో కుమార్తె పొంగూరు సింధూర ప్రచారం చేశారు.


ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న పొంగూరు నారాయణ

● శ్రీరాముని రథోత్సవంలో... : బాలాజీనగర్‌లోని కోదండరామాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం నిర్వహించిన రథోత్సవంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు ఆయనకు ఆశీస్సులు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, అంచూరి జానకి, శ్రీనివాసులు నాయుడు, కమ్మ కల్యాణి, పెంచల నాయుడు, ఆలయ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు గుప్తా పాల్గొన్నారు.

● టీడీపీలో చేరికలు

గోమతినగర్‌లోని నారాయణ క్యాంపు కార్యాలయంలో నగరానికి చెందిన వైసీపీ నేతలు, యువత నారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అందరి ఆశీర్వాదంతో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని, సుపరిపాలన అంటే ఏమిటో ప్రజలకు చూపిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డిని గెలిపించాలని కోరారు. .



రోజాను అడ్డుకుంటున్న వారికి నచ్చజెబుతున్న మంత్రి సెక్యూరిటీ సిబ్బంది

# ఏం మేలు చేశారని మళ్లీ వచ్చారు?

**మంత్రి రోజాను అడ్డుకున్న ఎస్బీఆర్ పురం ఎస్టీ కాలనీవాసులు**

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24 : మాకేం మేలు చేశారని ఓట్లడగడానికి వచ్చారంటూ మంత్రి రోజాను ఎస్టీలు నిలదీశారు. వడమాల పేట మండల పరిధిలోని ఎస్బీఆర్ పురం పంచాయతీ ఎస్టీ కాలనీవాసులు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారానికి వచ్చిన రోజాను పొలిమేరలోనే అడ్డుకున్నారు.తమ గ్రామంలో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించలేదంటూ ఫైర్ అయ్యారు.గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామని, స్మశానానికి స్థల సమస్య తీరుస్తానని గత ఎన్నికలకు ముందు రోజా కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఐదేళ్లు పూర్తయినా ఒక్క సమస్యను కూడా పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.రేపటి లోపల సమస్యను పరిష్కరిస్తానని మంత్రి రోజా నచ్చజెప్పినప్పటికీ ఎస్టీ కాలనీవాసులు విశ్వసించలేదు. ఎట్టి పరిస్థితుల్లో తమ గ్రామంలో అడుగు పెట్టకూడదని పొలిమేర వద్దే అడ్డుతగిలారు. దీంతో చేసేది లేక మంత్రి రోజా వెనుదిరిగారు.

# వైసీపీ దౌర్జన్య కాండ





దొడ్డాపురం వీధిలో ఉద్రిక్త పరిస్థితులు

**ప్రచారం ముసుగులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు**

**ఘర్షణకు దిగడంతో ఓ కార్యకర్తకు గాయాలు**

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24: తిరుపతిలో ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఎన్డీయే కూటమి అభ్యర్థి తరఫున ప్రచారం చేసే నాయకులు, కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు వెంటాడుతున్నారు. బుధవారం 27వ డివిజన్‌లోని దొడ్డాపురం వీధిలో టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. వైసీపీ తరఫున ప్రచారం చేస్తున్న వేణు, ధీరజ్, కార్పొరేటర్ శైలజ, పునీతమ్మ, ఉష, నరసింహ తదితరులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొంత పక్కకు తప్పుకుంటే తాము ప్రచారం చేసుకుంటామని టీడీపీ, జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. కానీ వైసీపీ నాయకులు మెట్టు దిగకపోవడంతో అక్కడ కాసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెరో వైపు మళ్లించేందుకు యత్నించారు. అయినా స్థానిక వైసీపీ నాయకులు ఉదయ్‌వంశీ, సురేష్, ముద్ర ప్రసాదు, తదితరులు మరోసారి రెచ్చగొడుతూ ఎన్డీయే కార్యకర్తల పైకి దూసుకొచ్చేందుకు యత్నించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఎన్డీయే కార్యకర్త ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. ఓ పార్టీ ప్రచారం చేస్తుండగా మరో పార్టీకి పోలీసులు ఎలా అనుమతిస్తారని ఎన్డీయే నాయకులు ప్రశ్నిస్తున్నారు.

**జబ్బారు లేఅవుట్‌లోనూ..**

తిరుపతి జబ్బారు లేఅవుట్‌లో ఎన్డీయే కూటమి నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో వైసీపీ శ్రేణులు దాడికి యత్నించాయి. 26వ డివిజన్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారం చేస్తుండగా స్థానిక కార్పొరేటర్ ఆఫీసు వద్ద వైసీపీ కార్యకర్తలు ప్రచారం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అయినా శాంతియుతంగా ఎన్డీయే ప్రచారం చేయడంతో ఎటువంటి వివాదం తలెత్తలేదు.

# చంద్రగిరిలోనూ వైసీపీ రగడ

**● టీడీపీ కళా బృందం ప్రదర్శనలో వైసీపీ ప్రచార రథం**



టీడీపీ కళాబృందం వద్ద పెట్టిన వైసీపీ ప్రచార వాహనం

చంద్రగిరి, ఏప్రిల్ 24: చంద్రగిరిలోనూ టీడీపీ నేతలతో బుధవారం వైసీపీ శ్రేణులు రగడకు దిగాయి. గురువారం చంద్రగిరి టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమం పెట్టుకున్నారు. ఈ క్రమంలో తమ అభ్యర్థి నాగాలమ్మ ఆలయంలో పూజలు చేస్తారని చెప్పి తొండవాడ పంచాయతీ పరిధిలో ఉన్న ఉగ్రప్రత్యంగిరా దేవాలయం నుంచి చంద్రగిరి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వైసీపీ జెండాలను పాతేశారు. అలాగే టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని కూడా నాగాలమ్మ ఆలయంలో పూజలు చేసి, నామినేషన్‌కు వెళ్లనుండటంతో టీడీపీ జెండాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం టీడీపీ జెండాలను తొలగించాలంటూ వైసీపీ శ్రేణులు పట్టుబట్టాయి. పైగా తమ జెండాలు పాతడానికి అనుమతి ఉందంటూ వైసీపీ శ్రేణులు రగడకు దిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులొచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపేశారు.ఆ తర్వాత కూడా.. టీడీపీ కళాజాత బృందం ప్రదర్శన చంద్రగిరి ఫ్లైఓవర్ వద్ద జరుగుతుండగా వైసీపీ ప్రచార వాహనాన్ని కూడా అక్కడే పెట్టి సౌండ్ పెంచారు. విషయం తెలుసుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అక్కడికి వచ్చి వైసీపీ ప్రచార రథం తీసుకెళ్లిపోవాలని చెప్పినా వినిపించుకోలేదు. చివరకు పోలీసులు రావడంతో వైసీపీ ప్రచార రథం అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు.





వెంకటగిరిలో భారీ ప్రదర్శనగా నామినేషన్ కేంద్రానికి వెళుతున్న టీడీపీ అభ్యర్థి రామకృష్ణ

# ఆరవరోజు 72నామినేషన్లు

**తిరుపతి పార్లమెంటుకు 8.. అసెంబ్లీకి 59 మంది దాఖలు**

**నేటితో ముగియనున్న నామినేషన్ల జాతర**

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలకఘట్టమైన నామినేషన్ల ప్రక్రియకు నేటితో తెరపడనుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ అడపా దడపా మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి.ఆరవరోజైన బుధవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంటుకు ఎనిమిది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 59 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగియనుంది.కాగా గురువారం చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరఫున పులివర్తి నాని, వైసీపీ తరఫున చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. తిరుపతి లోకసభ స్థానానికి బుధవారం వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ మద్దెల గురుమూర్తి రెండవ సారి నామినేషన్లు అందజేశారు. ఆయన సతీమణి నవ్యకిరణ్ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున అంజయ్య, సమాజ్‌వాదీ పార్టీ నుంచి తేజోవతి, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ నుంచి భరణిబాస్, యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పుణ్యమూర్తి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి శివ, ఇండిపెండెంట్‌గా దాసరి గౌతమ్ నామినేషను పత్రాలు సమర్పించారు.వెంకటగిరి అసెంబ్లీకి టీడీపీ నుంచి కురుగొండ్ల రామకృష్ణ బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు భారీ ర్యాలీగా ఆయన నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ర్యాలీకి తరలివచ్చిన టీడీపీ శ్రేణులతో వెంకటగిరి వీధులు నిండిపోయాయి.పూలతో అలంకరించిన చైతన్య రథంపై ఎక్కిన కురుగొండ్ల రామకృష్ణ ర్యాలీకి ముందు సాగారు. కాగా టీడీపీ డమ్మీ అభ్యర్థిగా కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ, బీఎస్పీ నుంచి జయచంద్రయ్య, ఇండిపెండెంట్లుగా కె.వెంకటేశ్వర్లు, వెంకటాచలపతి నామినేషన్లు అందజేశారు.గూడూరు అసెంబ్లీకి కాంగ్రెస్ తరఫున డాక్టర్ రామకృష్ణారావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పోలమ్మ, ఐబీపీ తరఫున కాకర్ల రమేష్, ఇండిపెండెంట్లుగా శివకుమార్, రమణయ్య, వెంకయ్య నామినేషన్లు అందజేశారు.సూళ్ళూరుపేటకు టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ, డమ్మీ అభ్యర్థిగా నెలవల రాజేష్, కాంగ్రెస్ తరఫున సి.శివ, కె.హరికృష్ణన్, బీఎస్పీ నుంచి రమణయ్య, ఇండిపెండెంట్‌గా అరుణ, సత్యవేడు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం కుమారుడు సుమన్‌కుమార్ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ డమ్మీ అభ్యర్థులుగా రమేష్‌బాబు, జె.రాజశేఖర్, నీతి నిజాయితీ పార్టీ తరఫున ఎ.చిట్టిబాబు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి కిరణ్, ఇండిపెండెంట్‌గా .రాజశేఖర్, సురేష్, కె.వెంకటాచలం, శ్రీకాళహస్తికి వైసీపీనుంచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి,జై భారత్ నేషనల్ పార్టీ తరఫున రొమ్మల నిరంజన్‌రెడ్డి, బీఎస్పీ నుంచి సురేంద్రబాబు, ఇండిపెండెంట్లుగా శ్రీనివాసులురెడ్డి, సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, ఎల్లయ్య, తిరుపతి నుంచి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, డమ్మీ అభ్యర్థిగా సత్యవతి,సీపీఐ నుంచి మురళి, బీఎస్పీ నుంచి వేణుగోపాలరాజు, అఖిల భారతీయ జన సంఘ్ నుంచి బాబు రాజేంద్రప్రసాద్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి శ్రీనివాసకుమార్, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి నుంచి జయకుమార్, ఇండిపెండెంట్లుగా తిరుమల, అక్కుపల్లి మునికృష్ణయ్య, శరవణ, రేఖ, మంజుల,సుబ్రహ్మణ్యం, చంద్రగిరి నియోజకవర్గం నుంచి యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మోహన్ దిలీప్‌కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున తురకా అమర్‌నాథ్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఈశ్వరయ్య, మనదేశం పార్టీ నుంచి జి.ఫరూక్, ఇండిపెండెంట్లుగా వినీల్ సాయివర్ధన్‌రెడ్డి పులివర్తి, శరవణ, నవీన్ రెడ్డి, రాము, ముని బాల చంద్ర, రాంబాబు, విజయకుమార్, రాజేష్, మణికంఠ నామినేషన్లు దాఖలు చేశారు.

## 28న పాపానాయుడుపేటకు బాలకృష్ణ

ఏర్పేడు, ఏప్రిల్ 24: ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 28వ తేదీ ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు రానున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించనున్నారు.

## వడదెబ్బతో మహిళ మృతి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 24: వడదెబ్బకు గురై మరో మహిళ చనిపోయింది. మృతురాలి కుటుంబసభ్యుల కథనం మేరకు... పుత్తూరు మండల పరిధిలోని తడుకు పంచాయతీ వీఎస్ఎస్ పురానికి చెందిన వ్యవసాయ కూలీ టి.రాజమ్మ బుధవారం ఎండ తీవ్రత భరించలేక ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందింది.

# కనులపండువగా సూర్యపూజ

తడ, ఏప్రిల్ 24:వేనాడు దీవిలోని శృంగీశ్వర రంగపెరుమాల్ ఆలయంలో బుధవారం సాయంత్రం భానుడి కిరణాలు మూల విరాట్ రంగనాథుడి పాదాలను తాకాయి.యేటా చైత్ర పౌర్ణమి నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ సూర్యపూజోత్సవం, మహా లక్షార్చన నిర్వహిస్తారు.మూల విరాట్ రంగ పెరుమాల్‌పై సూర్యాస్తమయ సమయంలో భానుడి కిరణాలు విష్ణుమూర్తి పాదాలను తాకుతాయి. సాయంత్రం 5.45గంటల సమయంలో భానుడి కిరణాలు ద్వార గోపురం, బలిపీఠం, ధ్వజస్తంభాలను తాకుతూ ఆలయంలోకి ప్రవేశించి స్వామివారి పాదాలను తాకి అనంతరం స్వామివారి నాభికి చేరి ముఖం, శిరస్సు వరకు చేరాయి. ఆ సమయంలో స్వామివారికి తులసి అర్చన, పాలాభిషేకం నిర్వహించారు.



రంగనాథుడి పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

# లేడీ డాక్టర్ ఆత్మహత్య?

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24: అనుమానాస్పద స్థితిలో ఓ లేడీ డాక్టర్ మృతి చెందడం కలకలం సృష్టించింది. శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేట ప్రాంతానికి చెందిన రాజేష్ రెడ్డి జనరల్ ఫిజీషియన్‌గా స్థిరపడ్డారు. తమిళనాడుకు చెందిన అశ్విని(38)కి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. మేనమామ సంరక్షణలో అశ్విని ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఎనిమిదేళ్ల క్రితం రాజేష్ రెడ్డితో వివాహం జరిగాక కొత్తపేటలో ప్రైవేటు క్లినిక్ నిర్వహించేవారు. వీరికి ఏడేళ్ల పాప ఉంది. బుధవారం ఉదయం అశ్విని మృతి చెందినట్లు సమాచారం అందడంతో శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ రారాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమిళనాడులోని అశ్విని బంధువులకు సమాచారం ఇచ్చారు. రాత్రి టిఫిన్ బాగా లేదన్న విషయమై దంపతుల మధ్య వాగ్వాదం జరిగిందని రాజేష్ పోలీసులకు వెల్లడించారు. ఆ తర్వాత ఇద్దరు వేర్వేరు బెడ్ రూముల్లో నిద్రించినట్లు తెలిపాడు. ఉదయం ఆమె బెడ్ రూమ్‌లోని కిటికీ గ్రిల్స్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేస్తుందని... అది చూసి మృతదేహాన్ని కిందకు దించి పడుకోబెట్టినట్లు వివరించాడు. ఆ తర్వాత డాక్టర్ రాజేష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అశ్విని కుటుంబ సభ్యులు తమిళనాడు నుంచి శ్రీకాళహస్తికి చేరుకున్న తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని సీఐ రారాజు తెలిపారు.

# రేపు సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం

**● ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి**

**● 67మందికి బంగారుపతకాలు, 580మందికి డిగ్రీలు ప్రదానం**



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 24: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు యూనివర్సిటీలోని ఇండోర్‌స్టేడియం జరగనుంది. చాన్సలర్ ఎన్.గోపాలస్వామి అధ్యక్షతన జరిగే ఈస్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ హాజరవుతున్నారని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ మాట్లాడుతూ.. సెంట్రల్‌వర్సిటీ హోదా పొందాక నిర్వహించే ఈ స్నాతకోత్సవం ప్రత్యేకమైందని చెప్పారు. 2022-23 విద్యాసంవత్సరంలో వర్సిటీలో పలు యూజీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా,సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన 580 మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి, ప్రథమస్థానం సాధించిన 67మందికి బంగారుపతకాలను ఉప రాష్ట్రపతి అందిస్తారని చెప్పారు. విశిష్ట అతిథిగా ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య హాజరై.. భారతీయ జ్ఞానపరంపరకు సంబంధించి రచించిన పలు పుస్తకాలను విడుదల చేస్తారని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, సీవోఈ డాక్టర్ కె.సాంబశివమూర్తి, ఏపీఆర్వో డాక్టర్ కనపాల కుమార్, డాక్టర్ బుల్లీదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల మీటింగు పేరుతో వైసీపీ ప్రచారమా?

**● చర్యలు తీసుకోవాలన్న టీడీపీ నేతలు**

కోట, ఏప్రిల్ 24:ముస్లింల సమావేశం పేరుతో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవా లంటూ టీడీపీ నాయకులు పట్టుబట్టారు. కోట పట్టణం లో బుధవారం జరిగిన ముస్లిం మైనార్టీ నియోజకవర్గ సమావేశం టీడీపీ నేతల అభ్యంతరాలు, అధికారుల విచారణల నడుమ ముగిసింది. కోటలోని రెడ్డి సంక్షేమభవన్‌లో వైసీపీ నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైసీపీ మైనారిటీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని ముస్లింలను వైసీపీకి ఓటు వేయాలని ప్రలోభ పెడుతున్నారంటూ టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో శంకరయ్యకు ఫిర్యాదు చేశారు.ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఇలాంటి సమావేశాలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.వెంటనే చర్యలు తీసుకోవాలని కోరడంతో ఎంపీడీవో శంకరయ్య రెడ్డి సంక్షేమ భవనానికి వెళ్లారు.అక్కడ వైసీపీ నేతలను సమావేశ వివరాలు అడిగి తెలుసుకున్నారు.దీంతో వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఏడాది క్రితమే తన పదవీ కాలం పూర్తయ్యిందని, తనపై పోలీస్ కేసు పెడితే తేల్చుకుంటానని ఖాదర్‌బాషా ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగారు.చైర్మన్ పదవీ కాలానికి సంబంధించిన పత్రాలను తీసుకున్న ఎంపీడీవో దీనిపై కలెక్టర్‌కు, ఆర్వోకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.



రెడ్డిభవన్‌లో వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్న ఎంపీడీవో

కోలగట్లకు చెందిన రైతు రాధారెడ్డికి 25 ఎకరా ల మామిడి తోట ఉంది. మొక్కలు నాటి రెండేళ్లు దాటినా కాపురాలేదు. గతంలో క్వినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద రూ. 5 వేల వరకు రాయితీ ఇచ్చేవారు. ఆ డబ్బులతో మొక్కల కొమ్మలు కత్తిరించగా, కొత్త జంటలు వచ్చి కాపు కాసేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి నిధులు అందడం లేదని రాధారెడ్డి వాపోయారు.

తలుపూరుపాడుకు చెందిన రమణయ్యకు ఏడు ఎకరాల మామిడి తోట ఉంది. ప్రతిఏటా వాతావరణ పరిస్థితులు అనుకూలించక మామిడికాపు సక్ర మంగా లేక నష్టపోతున్నారు. పంట నష్టానికి ప్రభు త్వం పరిహారం కూడా చెల్లించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వీరిద్దరే కాదు... జిల్లాలోని మామిడి రైతులందరిదీ.


కాపులేని మామిడి తోట

# మామిడికి మద్దతేది ?

- అందని రాయితీలు
- పట్టించుకోని ప్రభుత్వం
- నాలుగేళ్లుగా తగ్గిన దిగుబడులు
- ఆదుకుంటామన్న జగన్ హామీలు ఏమయ్యాయి..?

జగన్ ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేశాడు. తాను అధికారంలోకి రాగానే ఉద్ధరిస్తానని అన్ని రంగాల ప్రజలను మోసం చేశారు. అలాగే మామిడి రైతులను కూడా దగా చేశాడు. మామిడి రైతులకు ప్రోత్సా హమిస్తామని హామీ గుప్పించిన జగన్ సీఎం అయిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు.జిల్లాలో ఉద్యాన పంటల్లో భాగమయిన మామిడి తోటలు విస్తా రంగా ఉన్నాయి. అయితే రైతులు ప్రతి ఏటా తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారు. దిగుబడి ఉంటే ధర ఉండదు, ధర ఉంటే దిగుబడి లేక రైతులు నష్టపోతు న్నారు. ఇదిలా ఉంటే ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహం లేక వారు కుదే లవుతున్నారు.

**● రాయితీలు కరువు**

మామిడి తోటలకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి రాయితీలు కల్పించలేదు. గతంలో ఐదేళ్ల నుంచి పదేళ్ల లోపు మామిడి తోటలకు క్వినాపి మేనేజ్‌మెంట్ పథకం కింద కొమ్మల కత్తిరింపు కోసం హెక్టార్‌కు రూ. 5వేలు ఇచ్చేవారు. ఎరువులు, మందులపై కూడా రాయితీ కల్పిం చేవారు. 20 ఏళ్లలోపు తోటలకు పునరుద్ధరణ పథకం కింద హెక్టార్‌కు రూ. 20 వేల రాయితీతో వివిధ రకాల పరికరాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాయితీల ఊసే లేదు. ఈ క్రమంలో జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడు తుంది.

**● ఐదు వేల హెక్టార్లలో సాగు**

జిల్లాలో సుమారు 5 వేల హెక్టార్లలో మామిడి సాగు అవు తుంది. సంగం, ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరు, ఉదయ గిరి, కలిగిరి, ఏయస్‌పేట, జలదంకి, దగదర్తి, ఉలవపాడు తది తర మండలాలల్లో అధికంగా మామిడి సాగు చేస్తున్నారు. బంగి నపల్లి, అంటుమామిడి, నీలం, రసాలు వంటి రకాలు సాగవుతు న్నాయి. వీటిల్లో ప్రధానంగా బంగినపల్లి మామిడికి మంచి గిరాకీ, డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు జిల్లా నుంచి ఎగుమతి అవకాశం ఉంది. ప్రస్తుతం దిగుబడి సరిగా లేదు. ఉన్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. దిగుబడి బాగా వచ్చిన ఏడాది కాయలు కోత కోసిన వెంటనే నిల్వ ఉంచేందుకు కోల్డ్‌స్టోరే జ్‌లు అందుబాటులో లేవు. మామిడి పంట అంతా ఒకేసారి కోయడం వల్ల మార్కెట్‌లో ధరలు తగ్గుతున్నాయి. దీంతో తాము మరింత నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో దిగు బడి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి రాయితీలు అందజే యాలని రైతులు కోరుతు న్నారు.

**- సంగం**


చెట్లకు కాపు లేకపోవడంతో నరికేసిన కొమ్మలు




## పోలింగ్ రోజున సెలవు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మేనెల 13న అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఆదేశా లు జారీ చేశారని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న రోజువారీ సాధారణ, షిఫ్ట్‌లపై పనిచేసే కార్మికులంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ ఉత్తర్వు లు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఆ రోజున ఏ యజమాని కూడా వేతనం తగ్గించరాదన్నారు. ఎవరై నా ఈ ఉత్తర్వులను ఉల్లం ఘిస్తే కార్మిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

## ప్రజాతత్వం మన ఓటు

● లియో టాల్ స్టాయి



పెద్దల మాట

ప్రభుత్వాల బలం ఎప్పుడూ ప్రజల అజ్ఞానంలో ఉంటుంది. ప్రభుత్వాలకు ఈ విషయం తెలుసు కాబట్టి ప్రజల్లో నిజమైన జ్ఞానాన్ని ఇవి వ్యతిరేకిస్తాయి. ఈ సత్యాన్ని మనం గుర్తించాల్సి ఉంది. ఒకవైపు ప్రజల్లో అజ్ఞానాన్ని వ్యాప్తి చేస్తూ, జ్ఞానాన్ని పెంపొందించేందుకు తీరిక లేనట్లుగా నటిస్తున్న ప్రభుత్వాన్ని అలాగే వదిలివేయడం అత్యంత హానికరం. వ్యతిరేక ఓటుతో ఇంటికి పంపండి.

- నెల్లూరు (సాంస్కృతికం)




అబ్బా.. ఏం సెగ

## పరుగులు పెట్టించిన ప్రభాకరుడు

ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సం దర్భంగా ఆయన స్థానిక ఆనకట్ట సమీపం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రదర్శన నుంచి బయటకు పరుగులు తీశారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలకు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లతోపాటు ఒక్కొక్కరికి రూ.300ల చొప్పున నగదు, భోజన ప్యాకెట్లు ఇచ్చినట్లు సమాచారం. అయినా కూడా జనం మధ్యలోనే పరుగులు తీశారు.

- ఉదయగిరి

## డిపాజిట్ దక్కడమంటే...?

ఈ ఎన్నికల్లో ఫలానా నాయకుడికి డిపాజిట్ వస్తుందా.. అని అప్పుడ ప్పుడూ అడుగుతుంటాం. అసలీ డిపాజిట్ అంటే ఏమిటో తెలుసుకుందాం. ఎన్నికల్లో పోటీ చేసే వారు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కొంత నగదు డిపాజిట్‌గా చెల్లించాలి. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరికి చెందిన వారు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు చెల్లించాలి. పార్లమెంట్ స్థానాలకైతే జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.12,500లు చెల్లించాలి. ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు 16.5 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి ఇస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు. దీన్ని డిపాజిట్ గల్లంతు అంటారు.



పోటీకి పార్టీ అభ్యర్థులు వెనుకడుగు



- ఉదయగిరి రూరల్

## వీక్లీ ఆఫ్.. తుస్!

**పోలీసుశాఖలో మూణ్నాళ్ల ముచ్చటగా వారాంతపు సెలవులు**

పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి రాగానే వాటిని అలా అమలు చేసి.. ఇలా తీసేశాడు. సరిగ్గా నాలుగేళ్ల కిందట జూన్ 19న జిల్లాలోని పోలీసులకు వారంతపు సెలవులు అమలు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తొలిరోజు 45 మందికి మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖలోని సివిల్, ట్రాఫిక్, ఏఆర్ ఇలా పలు విభాగాల పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లలో వారాంతపు సెలవుల చార్టులను సిద్ధం చేశారు. ఈ చార్టులో ఆ స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఏ రోజు వారంతపు సెలవు తీసుకోవాలన్న సమాచారం పొందుపరిచారు. సెలవు లేని ఉద్యోగం ఏదైనా ఉందా ? అంటే అది పోలీసు ఉద్యోగమేరా ? అను కునే ఈ రోజుల్లో వారంలో ఒక రోజు సెలవు అమలు చేస్తారని తెలిసాక పోలీసు సిబ్బందితోపాటు వారి కుటుంబసభ్యులు ఎంతో ఆనందపడ్డారు. అయితే వారిలో ఈ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు. రోజులు గడిచే కొద్దీ సిబ్బంది కొరత ఉంది.. సెలవులు లేవంటూ అధికారులు వారంతపు సెలవులను పక్కన పెట్టేశారు. దీంతో ప్రభుత్వ తీరుపై పోలీసు సిబ్బంది ఆగ్రహిస్తున్నారు.



- నెల్లూరు (క్రైం)




## హామీపత్రం అడగండి !

ఎన్నికల వేళ ఎర్రికూతలు కూసి, కుర్రకారు గుండెల్లో తిష్టవేసి, గిర్రుగిర్రున తిరుగుతూ ప్రచారాలు సాగిస్తే కుప్పి గంతులు వేసే యువకులారా... మీకు సంబరా లెందుకు? ఎన్నికల సభల్లో ఉన్నవి లేనివి ఆశ పెట్టి, నన్ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తా... ఉపాధి కల్పిస్తా.. ఉద్యోగాలు ఇస్తా.. ఇళ్లు కట్టిస్తా... అని వాగ్దానాల వరాలిచ్చే నాయకుల హామీలపై పంచిన కరపత్రాలపై చిత్రశుద్ధిగా అమలు చేస్తామని సంతకం చేసి హామీపత్రం ఇవ్వమని అడగండి. యువ ఓటర్లారా ఎవడొచ్చి, ఎన్ని వాగ్దానాలు చేసినా ఓటరుగా మీరు సరైన నిర్ణయం తీసుకోండి. విచక్షణతో ఓటు వేయండి.

- నెల్లూరు (సాంస్కృతికం)


అడుగంటిన కావలి పెద్ద చెరువు

## నెరవేరని మాటలు.. కావలి ప్రజల పాట్లు !

**నీటిమీద రాతల్లా సీఎం హామీలు**

**అటకెక్కిన వాగ్దానాలు**

కావలి, ఏప్రిల్ 24: చుక్కల భూముల సమస్య పరిష్కార విషయమై గత ఏడాది మే12న కావలిలో జరిగిన సభ సాక్షిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నీటిబుడగల్లా మారాయి. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి కోరిక మేరకు కావలికి సీఎం జగన్ రూ.151 కోట్లతో వరాలు జల్లు కురిపించగా అవేమీ కూడా అమలుకు నోచలేదు.

**● కలగానే రిజర్వాయర్**

కావలి పెద్దచెరువును రిజర్వాయర్‌గా చేస్తే.. దాని దిగువన ఉన్న చెరువుల ద్వారా ఏడెనిమిది వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని చేసిన ప్రతిపాదనకు సీఎం రూ.35 కోట్లు మంజూరు చేశారు. 11 నెల లు గడిచినా నిధులు మంజూరు కాక, చెరువుల కింద పైర్లకు నీరందక ఎండిపోయాయి.

**● లింక్ కెనాల్ పనులు కూడా..**

సంగం బ్యారేజీ నుంచి చినక్రాక రిజర్వాయర్‌కు వెళ్లకుండా నేరుగా కావలి కాలువకు సాగునీరు వచ్చేందుకు అక్కడ లింక్ కెనాల్‌కు రూ.20 కోట్లు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. ఆ నిధులు మంజూరు చేసి ఉంటే ఆ కాలువ నుంచి జలదంకి, కావలి మండలాల చెరువులకు నేరుగా నీరు వచ్చి పంటలు పండేవి. ఆ అవకాశం లేకపోకడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


మౌలిక వసతులు లేక అర్ధంతరంగా ఆగిన ఇందిరమ్మ ఇళ్లు

**మోసం గురూ!**

**● సాగని ట్రంకురోడ్డు పనులు**

కావలి ట్రంకురోడ్డు పనులు నత్తనడకన నడుస్తుండ టంతో వాటిని ఎన్నికలలోపు పూర్తి చేసేందుకు మరో రూ.16 కోట్లు అవసరమని కోరగా, వాటిని మంజూరు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. ఎన్నికలు వచ్చినా అవి మంజూరు కాకపోగా ట్రంకు రోడ్డు విస్తరణ పనులు కూడా ఆగిపోయాయి.

**● మౌలిక వసతులు లేని కాలనీ**

గతంలో రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు నిర్మించిన ఇంది రమ్మ కాలనీల్లో మౌలిక వసతులు లేవు. దీంతో అనేక ఇళ్లు అర్ధంతరంగా ఆగిపోయి ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు కోరగా రూ.80 కోట్లు మంజూరు చేస్తు న్నట్లు సీఎం ప్రకటిం చారు. కాని ఇప్పటికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఆ ఇళ్లు అర్ధం తరంగా ఆగిపోయి నిరుపయోగంగా మారాయి.

**● హామీలన్నీ కాగితాలపైనే..**

సీఎం కావలికి ఇచ్చిన రూ.151 కోట్ల హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు. ఇటీవల సిద్ధం సభకు కావలి వచ్చిన పుడు పట్టణ అభివృద్ధి గురించి మాట మాత్రం కూడా మాట్లాడక పోవటమే కాక గతంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిన ఈ సీఎంను చూసి ఓట్లు ఎలా వేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఇంకెన్ని రోజులురా.. బాబూ ?

ఈ సారి ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగ్‌తేదీ, ఫలితాల వెల్లడికి సుదీర్ఘమైన సమయం ఇచ్చింది కేంద్ర ఎన్నికల సంఘం. దీంతో బరిలో నిలచిన అభ్యర్థులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎన్నికలతేదీ ఎప్పుడు వస్తుందా ? అని వారు ఎదురు చూస్తున్నారు. ఓ వైపు మండుతున్న ఎండలు..మరో వైపు విస్తృత ప్రచారంలో పార్టీ కేడర్‌ను వెంటనడిచేలా చూసు కోవడం అభ్యర్థులకు సవాల్‌గా మారింది. వారికి రోజు వారీగా మర్యాదలు, ఇతర ఖర్చులు భరించలేక నానా తం టాలు పడు తున్నారు. చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కార్య కర్తలకు ఉద యం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయం త్రం స్నాక్స్, రాత్రికి డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు టీ, కాఫీలు, చల్లటీనీరు, శీతలపానీయాలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రచారం చేసేందుకు కొందరు కూలీలను ఏర్పాటు చేసుకోగా, వారికి మద్యం, రోజువారీ భత్యంతోపాటు చోటామోటా నాయకులకు ప్యాకేజీలు, వాహనాల ఖర్చులకు రోజుకు రూ. లక్షల్లో ఖర్చవుతున్నారు. ఇవన్నీ భరించలేక ఎన్నికలెప్పుడు ముగు స్తాయిరా.. బాబూ.. అంటూ అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు.



- అనంతసాగరం

## అప్పట్లో సేవ.. ఇప్పుడు సంపాదన

మా రోజుల్లో ఎన్నికలకు, ఇప్పటి ఎన్నిక లకు ఎంతో తేడా ఉంది. అప్పట్లో పోటీ చేసే అభ్యర్థులు కనిపించేవారే కాదు. గ్రామ నాయకుడి వద్దకు మాత్రమే వచ్చి పోయే వారు. ఆయన వచ్చి ఫలానా అభ్యర్థికి, ఫలానా గుర్తుపై ఓటు వేయాలని చెప్పేవాడు. అది కూడా పోలింగ్‌కు ఒకటి, రెండు రోజుల ముందు... కానీ ఈ రోజుల్లో అభ్య ర్థులు, వారి కుటుంబ సభ్యులు ఇళ్లిళ్లు తిరుగుతున్నారు. ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. దీంతో ఏ నాయకుడు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియడంలేదు. నాడు ఎలాంటి ప్రలోభాలు ఉండేవికావు. అప్పటి నాయకులు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాలు చేసేవారు. నేడు సంపాదనే లక్ష్యంగా మారింది. ఎన్నికలనేవి డబ్బు, మద్యం మయమయ్యాయి. అందుకనే ప్రస్తుత రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయి.



- సుబ్బరామానాయుడు (92), ఏఎస్ కండ్రిక, రైతు

## పెచారానికి ఎలితే తాగినంత మందట!

యంకటయ్య: రేయ్ శీనా... ఎలచన్ల పెచారానికి ఎలితే తాగినోడికి తాగినంత మందంట కదరా...?

శీనయ్య : అవునంటా మావా... మొన్న మా చిన్నాయాన పోయి ఫుల్‌గా తాగేసి వచ్చాడు. మా చిన్నమ్మ తెగ తిడతావుంది.

యంకటయ్య: అవునేగాని రే... ఏ మందు పోస్తున్నారు.. వాళ్లు ?


శీనయ్య : మావా.. అల్లా పార్టీవోళ్లేమో చీప్‌లిక్కరంట. ఈలోళ్లు మాత్రం ఒకరకమైంది ఇస్తున్నారంట.

యంకటయ్య: మరి డబ్బులు ఈయట్లేదా శీనా ?

శీనయ్య : దానిలెక్క దాందే మావో... దీని లెక్క దీందే..! డబ్బులు ఈయకపోతే మనోళ్లు ఊరుకుంటారా...?

యంకటయ్య: మగోళ్లకి మందుపోయిస్తే.. మరి ఆడోళ్లరా...?

శీనయ్య : మావో వాళ్లా ఇప్పుడు ముదిరిపోయారే.. మందు బదులు డబ్బులు, లేదా మందే ఈయమంటున్నారంటా. ? అదీ మందల.




- నెల్లూరురూరల్

## బాబ్బాబు.. ఈసారి మీరడిగిందిస్తా!

తప్పు జరిగిపోయిందబ్బా.. ఈదఫా మీరు ఏది చెబితే అది చేస్తాను..?ఎవరు ఏమిటన్నది తెలుసుకున్నాను. మళ్లీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తాను... చంద్రగిరి నియోజకవర్గంలో రోజురోజుకూ చేజారిపోతున్న స్వపక్షీయులకు వైసీపీ నాయకుడు బుజ్జగిస్తూ చెబుతున్న మాటలివి.. గతఎన్నికల్లో తిరుపతి రూరల్ మండలంలో వైసీపీ విజయానికి చొక్కాలు చింపుకుని పనిచేసిన పలువురు కీలకనేతలు ఇప్పుడు ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతున్నారు. టీడీపీ కండువా కప్పుకుంటున్నారు. మొదట మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన నేతలు ఇప్పుడు డ్యామేజీని గుర్తించారు. దీంతో సీరియస్‌గా మధ్యవర్తిత్వ రాజకీయానికి తెరలేపారు. అనుచరులను రంగంలోకి దింపి బుజ్జగింపులు ప్రారంభించారు. వీరు ద్వితీయ శ్రేణి నేతల ఇళ్లకు వెళ్లి బతిమలాడుతున్నారని తెలిసింది. కొందరు బైపాస్ రోడ్డులోని కేఫ్‌లు, రెస్టారెంట్లు వేదికగా మంతనాలు సాగిస్తున్నారు. ఈదశలో పార్టీ మారకుండా కట్టడి చేయడం కష్టమని.. తమచేతుల్లో ఏమీలేదని ద్వితీయశ్రేణి నేతలు బదులిచ్చేసరికి మధ్యవర్తులు బిక్కముఖం వేస్తున్నారు. రెండ్రోజుల కితం ఒకే సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు నేతలతో కమిటీని వేసి పంచాయతీల వారీగా బాధ్యతలు అప్పగించారని తెలిసింది. మళ్లీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేస్తానని ప్రాధేయపడినా నేతలు మాత్రం బయటకు వచ్చి మనపని మనం చేసుకుపోదామని చర్చించుకున్నారని తెలిసింది.

- తిరుపతి రూరల్



## తగ్గేదే..లే..

'వాళ్ల ఐదేళ్ల మన పొట్టమీద కొట్టారు.. మనం ఈసారి ఓటుతో వాళ్ల మూలాలనే దెబ్బతీద్దాం' అని కూడబలుక్కున్నారు చిల్లకూరు మండలంలోని సిలికా మైన్ల యజమానులు. కోట, చిల్లకూరు మండలాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో 77 సిలికా మైన్లు ఉన్నాయి. ఇవన్నీ స్థానిక చోటా, బడా నేతల ఆధీనంలోనే ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక తీరు మారిపోయింది. సిండికేట్ ఏర్పాటుచేసి అందులో చేరాలంటూ స్థానిక యజమానులను ఆదేశించారు. వారు అంగీకరించకపోవడంతో నేరుగా అధికారపార్టీ నాయకులే రంగంలోకి దిగి మైన్లు లాగేసుకున్నారు. దీంతో స్థానిక యజమానులంతా కుదేలయ్యారు. ఆర్థికంగా చిక్కిపోయారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీకి సహకరించకూడదని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. గ్రహించిన వైసీపీ నేతలు మళ్లీ రంగంలోకి దిగారు. రాయలసీమకు చెందిన మంత్రి తిరుపతికి వీరందరినీ పిలిపించుకొని మాట్లాడినట్టు చెబుతున్నారు. గెలిచాక మైన్లు మీకే అప్పగిస్తామంటూ నమ్మబలికారు. నిన్నటిదాకా తమ బతుకులను అతలాకుతలం చేసిన వైసీపీ నేతల మాయమాటలను వీరు విశ్వసించేలా లేరు. వెనక్కు తగ్గబోమని అంతర్గతంగా చర్చించుకుంటున్నారని సమాచారం.

-కోట


7 ఆంధ్రజ్యోతి
తిరుపతి
www.andhrajyothy.com
గురువారం 25 ఏప్రిల్ 2024

# జన కేతనం



కాళంగి నది

## ఆ రోడ్డేది మధుసూదనా...



స్వర్ణముఖి నది ఒడ్డున కనకాచలం కింద రోడ్డు ప్రతిపాదించిన స్థలం


అదిగో శివం టు శివం రోడ్డు. ఇవిగో పనులంటూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అరచేతిలో వైకుంఠం చూపించారు. శ్రీకాళహస్తికి మహర్దశ వచ్చేసిందంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ఒక్క అడుగూ ముందుకు పడకుండానే ఐదేళ్లూ గడిపేశారు. పూతలపట్టు-నాయుడుపేట రహదారి బైపాస్ వంతెన నుంచి ముక్కంటి ఆలయం వరకు శివం టు శివం రోడ్డును గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. స్వర్ణముఖి నది ఒడ్డున కనకదుర్గమ్మ వెలసిన కనకాచలం కొండకు ఆనుకుని రామసేతు వంతెన నుంచి రోడ్డు సాగాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బైపాస్ వంతెన వద్ద అర్ధనారీశ్వర స్వామి ఆలయం నుంచి ముక్కంటి ఆలయం వరకు రూ.20 కోట్ల నిధులతో శివం టు శివం రోడ్డు నిర్మించేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఆచరణదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయించలేకపోయారు. రోడ్డు నిర్మించాల్సిన మార్గంలో స్వర్ణముఖి నది కరకట్ట అలాగే దర్శనమిస్తుంది. కనకాచలం కొండ వద్ద పాత పరిస్థితి కూడా ఏమాత్రం మారలేదు. శివం టు శివం రోడ్డు ఎక్కడైనా కనబడిందా... ఎవరైనా చూశారా అంటూ ఇక్కడి ప్రజలు చలోక్తులు విసురుతున్నారు.

- శ్రీకాళహస్తి

# జనం చెవిలో జగన్ పూలు

● అధినేత బాటలో వైసీపీ తమ్ముళ్లు

గత ఎన్నికల్లో అధికారం కోసం జగన్ ఎడాపెడా హామీలు గుప్పించారు. సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా అన్ని వర్గాలకూ మాటిచ్చేశారు. మాట తప్పను - మడం తిప్పను అంటూ ప్రగల్భాలు పలికారు. సీఎం గద్దెనెక్కాక తానిచ్చిన హామీలను గాలికొదిలేశారు. అధినేత బాటనే వైసీపీ నాయకులూ అనుసరించారు. తమ నియోజకవర్గాల్లో హామీలిచ్చేశారు. అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా జనం చెవిలో పువ్వు పెట్టారు. ఆ కోవలోకి వచ్చే హామీలను మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...



## రైతుల ఆశలకు జగన్ సర్కార్ 'చెక్'

● టీడీపీ ప్రభుత్వంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదన
● ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోని నాయకులు

మా వైసీపీ అధికారంలోకి రాగానే కాళంగి నదిపై నాలుగు చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తాం...

2019 ఎన్నికల వేళ వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలకిచ్చిన హామీ ఇది. ఆయన గెలిచారు. వైసీపీ ప్రభుత్వమూ ఏర్పడింది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల హామీని మాత్రం విస్మరించారు.

జిల్లాలో ఏడు మండలాల్లో సుమారు లక్ష ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షకంగా సాగు నీరందించే కాళంగి నదిపై చెక్ డ్యాముల ఏర్పాటు కలగానే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఏటా వర్షాకాలంలో వృథాగా పోతున్న లక్ష క్యూసెక్కుల వరద నీటి నిల్వకు చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు చేయిస్తానన్న ఎమ్మెల్యే సంజీవయ్య మాట నిలబెట్టుకోలేదు. చెక్ డ్యాములు నిర్మిస్తారని ఐదేళ్లూ నిరీక్షించి రైతులు నీరసపడ్డారు. పిచ్చాటూరు మండలం అరణియార్‌కు పశ్చిమంగా ఉన్న నగరి కొండల్లో చిన్న కాలువగా పుట్టి, పిచ్చాటూరుతో పాటు, కేఈబీపురం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల మీదుగా ప్రవహించి పులికాట్ సరస్సులో కలిస్తుంది కాళంగి నది. వర్షాకాలంలో లక్షలాది కొద్దీ క్యూసెక్కుల వరద నీటితో జలకళ ఉట్టిపడుతుంది. తర్వాత వరద నీరు పులికాట్ సరస్సులో కలిసిపోతోంది.

### టీడీపీ ప్రభుత్వంలో కొంత కదలిక

వర్షపు నీటిని దిగువ ప్రాంతంలో నిల్వ చేయగలిగితే లక్ష ఎకరాలకు సాగు నీరందుతుందని ఇరిగేషన్‌శాఖ అధికారులు లెక్కలేశారు. రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలో నీరు వినియోగించుకోవచ్చు. నది పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. వ్యవసాయ బోర్ల ద్వార రెండు పంటలను పండించుకునే అవకాశం ఉంటుంది. అందుకే 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.56 కోట్లతో నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి తొలి అడుగు వేసింది. నిధుల మంజూరుకు సుముఖత చూపింది. టెక్నికల్ అంచనాలు సరిచేసే ప్రక్రియలో కొంత ఆలస్యమైంది. ఈలోగా ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఆ ప్రతిపాదనలను అటకెక్కించింది. అన్నదాతల కోరిక నెరవేరలేదు.

- దొరవారిసత్రం



తనియాలి వద్ద కాళంగిపై పురాతన ఆనకట్ట

## కొండెక్కిన జగన్ హామీ

● ప్రత్యామ్నాయం చూపకుండా తిరుమల స్థానికులకు మొండిచేయి



విస్తరణ అనంతరం తిరుమల శ్రీవారి ఆలయం మాడవీధులు

'తిరుమల మాడవీధుల విస్తరణలో దుకాణాలు కోల్పోయిన 186 మంది వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయిస్తాం'
- గత ఎన్నికల సమయంలో జగన్ తిరుమల స్థానికులకు ఇచ్చిన హామీ ఇది.

జగన్ హామీలను నమ్మి మోసపోయిన వారిలో శ్రీవేంకటేశ్వరస్వామిని పాదాల దగ్గర నివసించే తిరుమల స్థానికులు కూడా ఉన్నారు. శ్రీవారి ఉత్సవ మూర్తులను ఊరేగించేందుకు, తిరుమల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు టీటీడీ దశల వారీగా ఆలయ మాడవీధులను అభివృద్ధి చేసింది. 1998 నుంచి 2018 వరకు ఆలయానికి ఆనుకుని ఉన్న కట్టడాలు, చెట్లు, బండరాళ్లు తొలగించారు. 2001-04 మధ్య ఆలయం చుట్టూ ఉన్న ఇళ్లు, దుకాణాలు, మఠాలు, చిన్నచిన్న ఆలయాలను తొలగించారు. ఇళ్లు, దుకాణాలు తొలగించిన క్రమంలో తిరుమల స్థానికులు, టీటీడీ అధికారుల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. జీవనాధారంతో పాటు ఇళ్లు కూడా లాగేసుకుంటే ఎక్కడ నివసించాలంటూ స్థానికులు తిరగబడ్డారు. దీంతో ప్రత్యామ్నాయంగా దుకాణాలను కేటాయిస్తామని చెప్పడంతో స్థానికులు చల్లబడ్డారు. దశలవారీగా కొందరికి ఇళ్లు, మరికొందరికి దుకాణాలు కేటాయించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములున్న వారు రెండు దుకాణాలు కేటాయించాలని పట్టుబట్టి ప్రత్యామ్నాయం పొందలేకపోయారు. కుటుంబంలో ఒకరు దుకాణాన్ని పొందాక, అదే కుటుంబానికి చెందిన మరొకరు కూడా న్యాయం చేయాలంటూ టీటీడీపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఇలా కొన్నేళ్లుగా తిరుమల స్థానికులు టీటీడీ చుట్టూ తిరుగుతూ వచ్చారు. ప్రతి కుటుంబానికీ ప్రత్యామ్నాయంగా ఇళ్లు, దుకాణాలు కేటాయించామని, ఇక ఈకేటగిరీలో ఎవరికి ఎలాంటి ఇవ్వాల్సిన అవసరం లేదంటూ టీటీడీ బోర్డు తీర్మానం చేసింది. తిరుమల స్థానికులు మాత్రం 186 మందికి దుకాణాలు రావాల్సి ఉందని పోరాటాలు చేశారు. ఈక్రమంలోనే గత ఎన్నికల సమయంలో జగన్ 186 మందికి ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తిరుమల స్థానికులు జగన్ మాటల మాయలో పడ్డారు. సమస్య తీరిపోతుందని నమ్మారు. కానీ వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

- తిరుమల

సత్యవేడు వర్తమానం



ఆదిమూలం

నియోజకవర్గంలో స్థానికేతర అంశం అధికార వైసీపీని ముచ్చెమటలు పట్టిస్తోంది. స్థానికులకే టికెట్ ఇవ్వాలని పెరిగిన డిమాండ్, ఇరవై రోజుల వ్యవధిలో రెండుసార్లు అభ్యర్థుల మార్పు, కేడర్ అభిప్రాయాలను పట్టించుకోకుండా అభ్యర్థిని ప్రకటించడం లాంటి అంశాలతో ఆ పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఫలితంగా వైసీపీ కేడర్ అసంతృప్తితో రగిలిపోతోంది.

- సత్యవేడు

# ఫ్యానుకు లోకల్ స్ట్రోక్

● సత్యవేడు వైసీపీ ఉక్కిరిబిక్కిరి ● స్థానిక అంశంతో కేడర్‌లో అసంతృప్తి
● దళితుల్లో ఆదిమూలంపై పెరిగిన సానుభూతి ● అభ్యర్థి రాజకీయానుభవంతో టీడీపీలో జోష్

సత్యవేడు ఎన్నికల బరిలో వైసీపీ ఎదురీదుతోంది. ఇక్కడ ఆ పార్టీ తరఫున 2019 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీని వీడి అనూహ్యంగా టీడీపీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత జనవరిలో వైసీపీ విడుదల చేసిన మూడవ జాబితాలో ఆదిమూలంను తిరుపతి ఎంపీ అభ్యర్థిగా, తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. ఎంపీగా వెళ్లేందుకు ఇష్టం లేని ఆదిమూలం తిరస్కరించారు. ఎమ్మెల్యే స్థానం నుంచి తప్పించి, ఎంపీగా కూడా టికెట్ లేకుండా చేయాలని పెద్దిరెడ్డి కుట్రపన్నారని ఆదిమూలం గట్టిగా గళం విప్పారు. పెద్దిరెడ్డిపై ఆయన ఆరోపణలు సంధిస్తూ ధిక్కారస్వరం వినిపించడం రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టించాయి. దీంతో ఆదిమూలంను సస్పెండ్ చేసేందుకు పార్టీ నిర్ణయం తీసుకుంటున్న తరుణంలో ఆయన టీడీపీతో టచ్‌లోకి వెళ్లారు. ఈ పరిణామంతో వైసీపీ కంగు తింది. తిరుపతి ఎంపీ స్థానానికి సరైన అభ్యర్థి దొరక్క గురుమూర్తినే మళ్లీ ఎంపీ అభ్యర్థిగా, మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ను సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది.

### నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి

రాజేష్ స్థానికేతరుడు కావడం, స్థానిక సమస్యల పట్ల అవగాహన లేకపోవడం, పట్టుమని నలుగురు నాయకుల పేర్లు కూడా సరిగ్గా చెప్పలేని స్థితిలో ఉండడంతో నియోజకవర్గంలో వైసీపీ నుంచే నిరసన సెగలు తగిలాయి. కనీస పరిచయం లేని వారికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదని, స్థానికులకే టికెట్ ఇవ్వాలని కేడర్ బహిరంగంగా డిమాండ్ చేస్తూ వచ్చారు. ఓ దశలో అభ్యర్థి మార్పు తప్పదన్న ప్రచారం కూడా జరిగింది. ఈ అసంతృప్తిని చల్లార్చేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రంగంలోకి దిగి పలుమార్లు చర్చించారు. అయినా అసంతృప్తి మాత్రం నివురుగప్పిన నిప్పులానే ఉంది. మెజారిటీ నాయకులు పార్టీ గెలుపుకోసం పనిచేసేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. దీనికి తోడు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఎమ్మెల్యేను డమ్మీగా చేసి జిల్లా కీలక నేత, ఆయన అనుచరులు యథేచ్ఛగా సాగించిన ఇసుక, గ్రావెల్ తదితర సహజ వనరుల దోపిడీ ఫ్యాను పార్టీలో గుబులు రేకెత్తిస్తోంది.

### ఏకతాటిపైకి టీడీపీ

పెద్దిరెడ్డిని ధిక్కరించి వైసీపీని వీడిన ఆదిమూలంపై ఆ పార్టీలోని ప్రధాన సామాజిక వర్గం చేసిన అమానుష వైఖరి పట్ల దళిత వర్గాల్లో ఆయనకు సానుభూతి పెరిగింది. మంత్రిపై చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ప్రధాన సామాజిక వర్గ నేతలు ఆయన దిష్టి బొమ్మలు దహనం చేసిన తీరు ఆదిమూలంకు అమాంతం ఆదరణను తెచ్చి పెట్టింది. ఈ నేపథ్యంలో పెత్తందారులపై చేసిన తిరుగుబాటును గుర్తించి ఆదిమూలంను అనూహ్యంగా టీడీపీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఆరంభంలో టీడీపీ శ్రేణులకు కొంత నిరాశ కలిగించింది. ఆదిమూలం మాత్రం నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి ఏకతాటి పైకి వచ్చేలా కలుపుకొన్నారు. ఇటీవల నియోజకవర్గంలో చంద్రబాబు నిర్వహించిన పర్యటనతో టీడీపీలో మరింత జోష్ పెరిగింది. ఆదిమూలం స్థానికుడు కావడం, స్వతహాగా ఉద్యమాల నేపథ్యమున్న వారు కావడం, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నియోజకవర్గంలోని 700 గ్రామాల్లో ఇరు పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలను పేర్లతో సహా పలకరించడం లాంటి అంశాలు టీడీపీకి కలిసొస్తున్నాయి. నియోజకవర్గంలో తమ జెండా ఎగురవేయడం ఖాయమని టీడీపీ శ్రేణులు బలంగా విశ్వసిస్తున్నాయి.



నూకతోటి రాజేష్

### చంద్రబాబు పర్యటనతో వైసీపీలో టెన్షన్

టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల నిర్వహించిన ప్రజాగళం వైసీపీలో టెన్షన్‌కు గురిచేసింది. సత్యవేడులో పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు ఇసుక, గ్రావెల్, మట్టిని దోపిడి చేస్తున్నారని ఆయన చేసిన ఆరోపణలు, ఇక్కడ రాజకీయాలపై పెద్దిరెడ్డి పెత్తనమేంటని చేసిన సునిశిత విమర్శలు నియోజకవర్గ ప్రజల మనసులను సూటిగా తాకాయి. పెద్దిరెడ్డిపై ఆదిమూలం తిరుగుబాటుకు చంద్రబాబు నుంచి వచ్చిన సానుకూల స్పందన దళిత సామాజికవర్గాల్లో చర్చకు దారితీసింది.

## ఈ బండే ఆయన విజయరథం

సెంటిమెంట్

రాజకీయాల్లో ఒక్కొక్కరికీ ఓ సెంటిమెంటు ఉంటుంది. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏపీ26ఎస్ 0668 నంబరు గల మోటారు సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తుంటారు. బాలాయపల్లి మండలం పెరిమిడికి చెందిన గడ్డం మురళి ఈ వాహనం నడిపితే ఆయన వెనుక కూర్చుంటారు. కొద్దిరోజులుగా ఆ మోటారు సైకిల్ మళ్లీ ఆయన ఇంటివద్ద కనిపిస్తుండటంతో అక్కడి వారంతా ఇదే విషయాన్ని ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. 2009, 2014 ఎన్నికల్లో రామకృష్ణ ఈ మోటర్ సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. రెండు సార్లూ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం మోటారు సైకిల్ మార్చారు. సెంటుమెంట్ మిస్సవ్వడం వల్లే ఇలా జరిగిందని రామకృష్ణ అనుచరులు భావించారు. తొలుత ఆయన కుమార్తెకు టీడీపీ టికెట్ ఇచ్చినా తాజా మార్పుల్లో రామకృష్ణనే బరిలో నిలపాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. బుధవారం ఆయన 'సెంటిమెంటు బండి' మీదనే వెళ్లి నామినేషన్ వేశారు. దీంతో ఆయన అనుచరులంతా విజయం మనదే అని నినదించారు.

- వెంకటగిరి, డక్కిలి



నామినేషను వేయడానికి తన సెంటిమెంట్ ద్విచక్రవాహనం మీద వెనుక కూర్చుని వెళ్తున్న కురుగొండ్ల రామకృష్ణ

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## చంద్రబాబును సీఎంగా గెలిపించుకుందాం



చిల్లకూరులో ప్రచారం నిర్వహిస్తున్న పాశం సంధ్యారాణి తదితరులు

చిల్లకూరు, ఏప్రిల్ 24: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును సీఎంగా గెలిపించుకుందామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం పట్టణంలోని వడ్డిపాళెంలో సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసరాలు, విద్యుత్, బస్సుచార్జీలు పెరిగిపోయాయన్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అరాచకపాలన సాగిస్తున్న వైసీపీని గద్దెదించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ హయాంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. మరో మారు మహిళా సంక్షేమాన్ని కొనసాగించేందుకే మహాశక్తి పథకాన్ని అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తానంకి నానాజీ, పట్టాభిరామిరెడ్డి, కృష్ణయ్య, రాజేంద్ర, రామచంద్రయ్య, దినేష్, రామ్మూర్తి, సురేష్‌బాబు, నవీన్, జగదీష్, ఆల్తాఫ్, సుబ్బయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల పర్వం

గూడూరు అర్బన్/ సూళ్లూరుపేట/ వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 24: గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం 6 నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల అభ్యర్థులు తమ సహచరులతో కలిసి నామినేషన్ పత్రాలు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, ఆర్డీవో కిరణ్ కుమార్‌కు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థి రెండు సెట్లు, పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా అభ్యరి, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు, ఇండియన్ బిలీవర్స్ పార్టీ తరఫున నామినేషన్లను దాఖలు చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి సంబంధించి బుధవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ రెండో సెట్, నెలవల రాజేష్ నామినేషన్లను ఆర్వోకు అందజేశారు. వెంకటగిరి అసెంబ్లీ నియోజవర్గానికి సంబంధించి ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయని ఆర్వో తెలిపారు. టీడీపీ నుంచి కురుగొండ్ల రామకృష్ణ, కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ, బీఎస్పీ సహా ఇద్దరు స్వతంత్రులు నామినేషన్లు సమర్పించారు.

## తాళమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



గూడూరు అర్బన్, ఏప్రిల్ 24: పట్టణ గ్రామ దేవత తాళమ్మ ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా చిట్టెం శ్రీనివాసులుగౌడ్, ఉపాధ్యక్షుడిగా మస్తానయ్య, కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా రఘురాం, సంయుక్త కార్యదర్శిగా ఏ.మురళితో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాశిన నాగులు, రమణయ్య, నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





### వివాహిత ఆత్మహత్య

కోట, ఏప్రిల్ 24: మండల పరిధిలోని గోవిందపల్లి గిరిజన కాలనీలో చెంచమ్మ (33) అనే వివాహిత మంగళవారం విష గుళికలు తినింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబీకులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్సలు ఫలించక బుధవారం ఆమె మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

### దాడిపై కేసు నమోదు

కోట మండల పరిధిలోని విద్యానగర్‌లో సయ్యద్ జలీల్ అనే యువకుడిపై దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. చిల్లకూరు మండలం ఉడతావారిపాళేనికి చెందిన సయ్యద్ జలీల్ కోట మండలం విద్యానగర్‌లో ఉండగా గూడూరుకు చెందిన ముగ్గురు కర్రలతో దాడి చేసి పరారయ్యారన్నారు.

### 15 మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట పట్టణంలోని చల్లకాలువ వద్ద బుధవారం రాత్రి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ధనుష్, నవీన్ అనే ఇద్దరు యువకులు బాటిళ్లను బెల్టు దుకాణానికి తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### పాస్టర్‌పై దాడి అమానుషం

కోట, ఏప్రిల్ 24: ప్రార్థన చేసుకుంటున్న పాస్టర్ మనోజ్‌కుమార్‌పై దాడి చేయడం అమానుషమని కోట పట్టణంలోని సెయింట్‌పాల్ లూథరన్ చర్చి చైర్మన్ రమ్య సురేష్, సంఘ కాపరి నరేష్‌కుమార్ వాపోయారు. చర్చిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... వారం రోజుల క్రితం గూడూరులో సంఘ సభ్యులు కాని కొంత మంది క్రైస్తవమతానికి వారంతా మచ్చను తీసుకువస్తున్నారన్నారు.

# జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధం: కురుగొండ్ల

### అట్టహాసంగా నామినేషన్ సమర్పణ



ఆర్వోకు నామినేషన్ సమర్పిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 24: ప్రజలను రాక్షసుడిలా పీక్కుతిన్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు ఈ ఎన్నికల్లో ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించారు. అనంతరం కార్యాలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్ల జే ట్యాక్సు పేరుతో రాష్ట్రాన్ని జగన్ రెడ్డి అడ్డంగా దోచుకొన్నాడన్నారు. ఇలాంటి వ్యక్తికి ఓటు వేస్తే భవిష్యత్తు ఉండదని జనం గ్రహించారన్నారు. లక్ష కోట్లు దోచుకున్న జగన్ అంత డబ్బు ఏం చేసుకుంటారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ మాట్లాడుతూ... చిన్నగులక రాయి గాయాన్ని మాన్పలేని దుస్థితిలో ఈ రాష్ట్ర వైద్యరంగం ఉందనడానికి జగన్ ఉదంతమే నిదర్శన మన్నారు. దేశంలో అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చి గుండె, మెదడు వంటి అవయవాలను మార్పిడి చేస్తున్న ఈ రోజుల్లో ముఖ్యమంత్రి జగన్‌కు చిన్న గులక రాయిదెబ్బ రోజుల తరబడి మాన్పించలేదంటే ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ రెడ్డి ప్లాస్టర్ వేసుకుని ప్రజల సానుభూతి పొందాలని నాటకం ఆడుతున్నారా లేక నిజంగానే గాయం మాన్పించే వైద్యం అందక అలా తిరుగుతున్నారా అనే దానిపై ఆయన రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

# కార్యకర్తల్లో జోష్ నింపిన కురుగొండ్ల నామినేషన్





వెంకటగిరి/ డక్కిలి, ఏప్రిల్ 24: వెంకటగిరి పట్టణంలో బుధవరం టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ నిపింది. క్రాస్ రోడ్డు, పాలకేంద్రం, రాజా వీధి, తూర్పువీధి, శివాలయం తదితర ప్రాంతాలన్నీ పసుపు జెండాలతో హోరెత్తాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సుల్లో స్వచ్ఛందంగా చేరుకున్నారు. ఆయన భారీ జనసందోహం మధ్య ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ దాఖలు చేసి వెళ్లిపోయిన తరువాత ఆయన కుమార్తె లక్ష్మీసాయిప్రియ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇక మహిళల బోనాలు, పులి నృత్యం, కేరళా డ్రమ్స్, డ్రోన్ ద్వారా జనం పైకి పూల వర్షం కురిపించడం వంటివి ఆకట్టుకున్నాయి.

## 12మంది వలంటీర్ల రాజీనామా

బాలాయపల్లి, ఏప్రిల్24: మండలంలోని నిడిగల్లు సచివాలయ పరిధిలోని నిడిగల్లు గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు, కయ్యూరు సచివాలయ పరిధిలోని కయ్యూరు గ్రామానికి చెందిన వలంటీరు బుధవారం రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఓటు హక్కు వజ్రాయుధం




గూడూరు, ఏప్రిల్ 24: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని ఎంఈవో కాంచన, ఎంపీడీవో రాజశేఖర్‌రావు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి ఉపాధ్యాయులు, కార్యదర్శులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా, ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బుల్లెట్ కన్నా ఓటు శక్తివంతమైందన్నారు. మురళి, రవచంద్ర, రవి, మురళీసింగ్, కరిముల్లా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతం... సీతారాముల కల్యాణం

గూడూరు, ఏప్రిల్ 24: పట్టణంలోని కోనేటిమిట్టలో కోదండ రామాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఎదురుకోలు జరిపారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివారిని గజవాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పూజాకార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### చిన్నారుల నృత్య ప్రదర్శనలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 24 : పట్టణంలోని బజారువీధిలో కొలువై ఉన్న శ్రీరామమందిరంలో వైభవంగా శ్రీరామనవమి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం శ్రీలక్ష్మీబృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శనలు నిర్వహించారు. అలాగే చిన్నారులు వివిధ వేషధారణలో చేసిన నృత్యప్రదర్శనలు అందరిని అలరించాయి.

## పోలీసు కవాతు



పెళ్లకూరు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడానికి పోలీసు కవాతు నిర్వహించినట్లు నాయుడుపేట రూరల్ సీఐ జగన్‌మోహన్‌రావు చెప్పారు. మండలంలోని కానూరు, కానూరురాజుపాలెం, రోసనూరు, రోసనూరు రాజుపాలెం, పెన్నేపల్లి, పునబాకల్లో కేంద్ర బలగాలతో కలసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఎన్డీఏ అధికారంలోకి రావడం ఖాయం: వరప్రసాదరావు





టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలులో వరప్రసాద్ - వరప్రసాదరావుకు బీజేపీ నాయకుల సత్కారం

వెంకటాచలం / గూడూరు, ఏప్రిల్ 24: అడ్డంగా దోచేసిన డబ్బులను అధికారపార్టీ నాయకులు వెదజల్లినా వారికి ఓటమి తప్పదని ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసావదరావు అన్నారు. బుధవారం తిరుపతి లోక్‌సభ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో వరప్రసాద రావు పాల్గొన్నారు. ముందుగా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించారు. వెంకటాచలంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు. అనంతరం కార్యాలయం వెలుపల వరప్రసాద రావు మాట్లాడుతూ... ఓటమి తప్పదని గ్రహించిన వైసీపీ నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు, రకరకాల ప్రలోభాలకు తెరదీస్తున్నారన్నారు. అందులో భాగంగానే సర్వేపల్లి నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యాన్ని డంప్ చేసి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోతున్నారని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, అమీర్ బాషా తదితరులు ఉన్నారు.

### ఎన్డీఏ హామీలను ప్రజలకు తెలియపరచాలి

ఎన్డీఏ మిత్రపక్షాలు ఇచ్చిన హామీలను ప్రజలకు తెలియపరచి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసేలా కృషి చేయాలని వెలగపల్లి వరప్రసాదరావు దిశానిర్దేశం చేశారు. గూడూరులో తనను మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులకు... గూడూరు నియోజకవర్గంలో తానుచేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. కూటమి గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుషోత్తమరెడ్డి, చిల్లకూరు జడ్పీటీసీ సభ్యుడు మన్యం శ్రీనివాసులు, వరగలి ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, పరమేష్, తిప్పనూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన జనసేన నాయకుడు హరిబాబును కలుసుకొని మద్దతు కోరారు. చెన్నూరుకు చెందిన టీడీపీ నాయకుడు టి.రాఘవరెడ్డితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

## విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



ప్రతిభ కనబరిచిన వైష్ణవి - చర్మిళ - రిషిత - కార్తీక్ - గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

# వైసీపీని గద్దె దించేందుకు కలిసికట్టుగా పనిచేద్దాం



టీడీపీలో చేరిన వారితో పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 24: రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దించేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండలంలోని వెందోడు గ్రామానికి చెందిన బీసీలు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాక్షస పాలన సాగించిందన్నారు. వైసీపీ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించింది టీడీపీయేనన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం తీసుకువచ్చేలా చంద్రబాబు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. బీసీల అభ్యున్నతికి పాటుపడిన టీడీపీ, ఉమ్మడి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, బి.చెంచురామయ్య, డి.రాఘవ రెడ్డి, పి.వెంకటేశ్వర్లు, పి.నాగరాజు, చెంచయ్య, శ్రీనివాసులు, శ్రీధర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### దుర్మార్గపు పాలనను తరిమికొడదాం

**కోట**: రాష్ట్రంలో ఐదేళ్లుగా ప్రజలను పట్టి పీడిస్తున్న సీఎం జగన్ దుర్మార్గపు పాలనను చరమగీతం పాడుదామని పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, అగ్రహారంలలో బుధవారం ఆయన ఓట్లను అభ్యర్థించారు. దళిత ద్రోహిగా జగన్ నిలిచిపోయారన్నారు. దళితుడైన డాక్టర్ సుధాకర్‌తోపాటు ఎంతో మంది దళితులను హింసించి పైసాచికంగా పోలీసుల చేత దాడి చేయించిన సంఘటనలను దళితులు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో కొద్ది రోజుల్లో చంద్రబాబు ఆధ్వర్యంలో రామరాజ్యం రానుందని ఆ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండబోతున్నారన్నారు. ఈ సందర్భంగా వీసీఅగ్రహారంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన ఆయా కార్యకర్తలకు సునీల్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, ఎన్.మోహన్‌రెడ్డి, జలీల్ అహ్మద్, రవీంద్రారెడ్డి, దశరథరామిరెడ్డి, టీ.సురేష్ బాబు, దారా సురేష్ తదితరులు పాశం వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రికి వాటర్‌కూలర్ వితరణ



గూడూరు, ఏప్రిల్ 24: స్థానిక ఏరియా ఆసుపత్రికి డాక్టర్ సీఆర్‌రెడ్డి జ్ఞాపకార్థం వాటర్‌కూలర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ... తన తండ్రి జ్ఞాపకార్థం కూలర్ అందించినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వేసవిలో చల్లనీరు అందుబాటులో ఉంచుతామన్నారు. డాక్టర్ జనార్దన రెడ్డి, డాక్టర్ రాజా, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చీరల పంపిణీ



గూడూరు అర్బన్, ఏప్రిల్ 24: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, ఆహార పొట్లాలు వితరణ చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు, రాము, శ్రీనివాసులు, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నెలవల రామయ్యకు ఘననివాళి

పెళ్లకూరు, ఏప్రిల్ 24 : సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సోదరుడు రామయ్యకు పెళ్లకూరు మండల నాయకులు నివాళిర్పించారు. అనారోగ్యం కారణంతో ఆయన మంగళవారం రాత్రి కన్నుమూశారు. సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సురేష్‌నాయుడు, హరినాయుడు రామయ్య భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

# వెంకటగిరిలో జనజాతర

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కురుగొండ్ల నామినేషన్
- అడుగడుగునా జనం బ్రహ్మరథం





నామినేషన్ వేయడానికి బయలు దేరుతున్న కురుగొండ్ల - చైతన్య రథం నుంచి ర్యాలీగా కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

వెంకటగిరి/ డక్కిలి, ఏప్రిల్ 24: వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామాల నుంచి జనం, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో వెంకటగిరి పట్టణం జన సంద్రంగా మారింది. కాశీవిశ్వనాథ స్వామి ఆలయం నుంచి పోలేరమ్మ ఆలయం వరకు జనంతో నిండిపోయింది. ముందుగా కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో కురుగొండ్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి చైతన్య రథంపై ర్యాలీగా డప్పు వాయిద్యాలు, బోనాల నృత్యాలు, పులి వేషాలు, యువత కేరింతల నడుమ కాశీపేట, రాజావీధి, నగిరి మీదుగా పోలేరమ్మ గుడికి చేరుకున్నారు. దారిపొడవునా జనం నిండిపోవడంతో పోలేరమ్మ ఆలయానికి చేరుకోవడానికి రెండు గంటలు పట్టింది. అమ్మవారి దర్శనానంతరం నామినేషన్ వేయడానికి తనకు అచ్చి వచ్చిన బైకు మీద కేంద్రానికి చేరుకున్నారు. జన సందోహం కారణంగా ఆయన ముందుగా అనుకున్న సమయానికి దాఖలు చేయలేకపోయారు. ఈక్రమంలో అక్కడే వేచి ఉండి మధ్యాహ్నం 1.30 తరువాత నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందచేశారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన జనాన్ని చూస్తుంటే కురుగొండ్ల విజయం ఖాయమైనట్టు పట్టణవాసులు పేర్కొంటున్నారు. నామినేషన్ అనంతరం రామకృష్ణ వెళ్లిపోయినా ఆయన కుమార్తె లక్ష్మీసాయిప్రియ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ ఎన్నికల్లో తన తండ్రి రామకృష్ణకు సైకిల్ గుర్తుపై , తిరుపతి ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న వరప్రసాద్‌కు కమలం గుర్తుకి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

### గజమాలతో సత్కారం

ర్యాలీ రాజా వీధిలోని రాజా ప్యాలెస్ వద్దకు చేరుకోగానే బైరవరం బ్రదర్స్ ఆధ్వర్యంలో కురుగొండ్లకు, ఆయన కుమార్తె లక్ష్మీసాయి ప్రియకు గజమాల వేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు జిందాబాద్, కురుగొండ్ల జిందాబాద్ అంటూ జన నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తిపోయింది. జనం మండు టెండను సైతం లెక్కచేయకుండా ర్యాలీ ముగిసే వరకు కురుగొండ్ల వెంటే ఉండి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కురుగొండ్ల రామకృష్ణ వియ్యంకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తానంకి నానాజీ, కురుగొండ్ల అల్లుడు శ్రీనివాస చౌదరి ర్యాలీ ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఎక్కడా జనం ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమన కోసం ర్యాలీ ముగిసే వరకు రోడ్డుపై ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లుతూ వచ్చారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగోటి నాగేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, జనసేన నాయకులు టి.క్రిష్ణయ్య, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో కురుగొండ్ల తదితరులు





కురుగొండ్ల, లక్ష్మీసాయిప్రియకు గజమాలలతో సత్కారం